RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 204 మేడ్చల్ మల్కాజ్‌గిరి 16 ఆగష్టు 2024 శుక్రవారం పేజీలు : 4

### వయనాడ్ విపత్తుకు.. మానవ తప్పిదాలే కారణం!

న్యూఢిల్లీ : కేరళలోని వయనాడ్ జిల్లాలో గత నెల 30న సంభవించిన ప్రకృతి విపత్తుకు మానవ ప్రేరేపిత తప్పిదాల కారణంగా తలెత్తిన వా తావరణ మార్పులే కారణమని వరల్డ్ వెదర్ ఆట్రిబ్యూషన్ (డబ్ల్యూడ బ్ల్యూఏ) అధ్యయనం వెల్లడించింది. గత నెల జూలై 30న ఒక్కరోజే 140 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, ఇది లండన్ వార్షిక వర్షపాతంలో నాలుగో వంతుకు సరిసమానమని పేర్కొంది. ఈ విపత్తు కారణంగా 350 మందికిపైగా ప్రజలు మృతి చెందారని, ఇది కనీవినీ ఎరుగని ఉత్పాతమని తెలిపింది. మానవ తప్పిదాల కారణంగానే 10% అధిక వర్షపాతం నమోదైనట్టు అధ్యయనం వివరించింది. వాతావరణం వేడెక్కినప్పుడు ఇలాంటి ఘటనలు సర్వసాధారణమని అధ్యయనంలో పాలుపంచుకున్న భారత్, అమెరికా, బ్రిటన్, స్వీడన్ దేశాలకు చెందిన 24 మంది పరిశోధకులు తెలిపారు.



# వాగ్దానాల అమలుకు కట్టుబడి ఉన్నాం

## గత ప్రభుత్వంలా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి భారం వేయం

## 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటపై జాతీయ జెండాను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రపంచ చరిత్రలోనే అహింసనే ఆయుధంగా మలిచి చేసిన మహా సంగ్రామం మన స్వాతంత్ర్య పోరాటమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "నెహ్రూ దార్శనికత ఫలితంగానే దేశం ఈ స్థాయిలో ఉంది. ఆయన ప్రారంభించిన ప్రాజెక్టులతోనే దేశం సస్యశ్యామలమైంది. బీహెచ్‌ఈఎల్, మిధాని వంటి పరిశ్రమలను ఆయన స్థాపించారు. లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ సాగులో విప్లవం తెచ్చారు. దేశానికి కాంగ్రెస్ చేసిన సేవలకు ఇవి కొన్ని ఉదాహరణలే. ఇటీవల అమెరికా పర్యటనలో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో సమావేశం అయ్యాం. తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. గత ప్రభుత్వం లాగా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రజల నెత్తిన భారం వేయం.

**రుణమాఫీ అమలు చేసి చూపిస్తున్నాం..** వరంగల్ డిక్లరేషన్ అమలులో భాగంగా రుణమాఫీ చేస్తున్నాం. రుణమాఫీ అసాధ్యమని కొందరు వక్రభాష్యం చెప్పారు. రూ.2 లక్షల వరకు అమలు చేసి చూపిస్తున్నాం. సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ కావడం లేదు. అలాంటి వారిని గుర్తించి అందజేస్తాం. కలెక్టరేట్లలో కౌంటర్లు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తాం. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు ఇప్పటికే అమలు చేశాం. ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వ వైభవం తెచ్చాం. దీని పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునికీకరణకు కట్టుబడి ఉన్నాం.

**త్వరలో రైతు భరోసా...** అర్హులైన అందరికీ రైతు భరోసా అందిస్తాం. గత ప్రభుత్వం అనర్హులకు రైతుబంధు ఇచ్చింది. త్వరలో రైతు భరోసా పథకాన్ని ప్రారంభించబోతున్నాం. సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు రూ.500 బోనస్ చెల్లిస్తాం. దీని కోసం 33 రకాల వరి ధాన్యాలను గుర్తించాం. పెండింగ్ ధరణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించాం. భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర చట్టం తీసుకురావాలని భావిస్తున్నాం. డ్రగ్స్ నియంత్రణకు కఠిన నిర్ణయాలు తీసుకున్నాం. టీ-న్యాబ్‌ను బలోపేతం చేశాం. సైబర్ మోసాలు, నేరాల బారిన పడిన వారికి సహాయం కోసం 1930 నంబర్ ఏర్పాటు చేశాం. త్వరలో విద్యా కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అంగన్వాడీలను ప్రీప్రైమరీ స్కూళ్లుగా మార్చబోతున్నాం.



ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మిస్తాం. ఇటీవలే స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశాం. ఇది విప్లవాత్మక మార్పులకు మలుపు కాబోతోంది. స్కిల్ వర్సిటీకి ఆనంద్ మహీంద్రాను ఛైర్మన్‌గా నియమించాం. తెలంగాణను ప్రపంచానికి ముఖద్వారంగా మార్చాలి. రాష్ట్ర బ్రాండ్‌ను విశ్వవేదికపై సగర్వంగా చాటాలి. ఇటీవల పెట్టుబడుల సాధన కోసం అమెరికాలో పర్యటించాం. దిగ్గజ సంస్థల అధినేతలు, ప్రతినిధులతో భేటీ అయ్యాం. ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణను వారికి పరిచయం చేశాం. మరోవైపు హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించడానికి హైడ్రా ఏర్పాటు చేసుకున్నాం." అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## అప్పుడు కరెంట్ పోతే వార్త.. ఇప్పుడు కరెంట్ ఉంటే వార్త



హైదరాబాద్, ఆగస్టు 15: స్టేషన్ ఘనపూర్‌కు త్వరలోనే ఉప ఎన్నిక వస్తుందని... రాజయ్య గెలువడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. దానం, కడియం, తెల్లంపై హైకోర్టుకు వెళ్ళామని.. మిగతా వారిపై కూడా సుప్రీంకోర్టుకు వెళతామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయామన్నారు. 14 స్థానాల్లో స్వల్ప తేడాతో ఓడిపోయామని చెప్పుకొచ్చారు. బాధపడాల్సిన, భయపడాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ అడ్డగోలు హామీలు నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. కాంగ్రెస్ 8 నెలల పాలనలో కరెంట్ మాయమైందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో కరెంట్ పోతే వార్త, రేవంత్ పాలనలో కరెంట్ ఉంటే వార్తగా మారిపోయిందన్నారు. ఊసరవెల్లులు పాలన చేస్తే తొండలు, బల్లులతో కరెంట్ పోతుందన్నారు. నోటిఫికేషన్ ఇవ్వకుండానే 30వేల ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. తెలంగాణ యువతకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతోందన్నారు. జాబ్ లెస్ కేలండర్ విడుదల చేశారని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం రైతు బంధు ఎత్తకొట్టి రుణ మాఫీ అని బిల్డప్ ఇచ్చారన్నారు. ఆగస్టు 15 వచ్చినా రెండు లక్షల రుణమాఫీ కాలేదని.. అందుకే రాహుల్ గాంధీ రమ్మన్నా రావడం లేదన్నారు. రేవంత్ రెడ్డి తులం బంగారం కాదు తులం ఇనుము కూడా ఇవ్వరన్నారు. ఆసరా పెన్షన్ 4వేలు పెంచుతామని అన్నారు... ఏమైంది అని నిలదీశారు. మా మీద కుటుంబ పాలన అని విమర్శలు చేశారని... ఇవ్వాల రేవంత్ సోదరులే అంతటా కనిపిస్తున్నారని తెలిపారు. 420 హామీలు నెరవేర్చాలని.. లేదంటే ఎండగడతామని హెచ్చరించారు.

## రుణమాఫీ అమలు చేశాం.. హరీశ్‌రావు రాజీనామా చేయాలి: రేవంత్‌రెడ్డి




వైరా: 'రుణమాఫీ చేయలేరని.. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తే సిద్ధిపేట ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు సవాల్ చేశారు. రుణమాఫీ అమలు చేశాం.. హరీశ్‌రావు రాజీనామా చేయాలి లేదంటే తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పాలి. అమర వీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాయాలి. తాను విసిరిన సవాల్‌ను వెనక్కి తీసుకుంటున్నట్టు హరీశ్‌రావు చెప్పాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'సాగుకు జీవం.. రైతుకు ఊతం' పేరుతో ఖమ్మం జిల్లా వైరాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. "వరంగల్ వేదికగా తెలంగాణ రైతులకు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రూ.31వేల కోట్లతో రుణమాఫీ చేశాం. ఖమ్మం గడ్డ కాంగ్రెస్ అడ్డా. ఖమ్మం జిల్లా రైతాంగానికి అండగా నిలిచేందుకే ఈ ప్రాంతానికి వచ్చా. 2026 పంద్రాగస్టు లోపు సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి ఖమ్మం జిల్లాలోని 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. రెండు పడక గదుల ఇళ్ల పేరిట కేసీఆర్ మోసం చేశారు. మేం నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం. ఆరు గ్యారంటీల అమలుకు నిరంతరం కష్టపడుతున్నాం" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్న భారత్

## ఎర్రకోటపై జాతీయ జెండా ఆవిష్కరించిన ప్రధాని మోదీ




న్యూఢిల్లీ: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు.. వికసిత్ భారత్ థీమ్‌తో హర్ ఘర్ తిరంగా పేరుతో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు జరుగుతున్నాయని అన్నారు. దేశం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుందామని, దేశం కోసం జీవితాలనే పణంగా పెట్టిన మహనీయులు ఎందరో ఉన్నారని, భారత ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

**వారికి దేశం రుణపడి ఉంది: ప్రధాని మోదీ..** ప్రాణాలర్పించిన మహనీయులకు దేశం రుణపడి ఉందని, శతాబ్దాల తరబడి దేశం బానిసత్వంలో మగ్గిందని, స్వాతంత్ర్యం కోసం ఆనాడు 40 కోట్ల మంది ప్రజలు పోరాడారని, ఇప్పుడు మన దేశ జనాభా 140 కోట్లకు చేరిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

140 కోట్ల మంది ప్రజల కలలను సాకారం చేయాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని అన్నారు. కొన్నేళ్లుగా విపత్తులు దేశాన్ని ఇబ్బందిపెట్టాయని.. ఈ సందర్భంగా విపత్తు బాధిత కుటుంబాలకు మోదీ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 2047 నాటికి వికసిత భారత్ మనందరి లక్ష్యమని, భారత్‌ను ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చాలని, తయారీ రంగంలో గ్లోబల్ హబ్‌గా భారత్‌ను మార్చాలని ప్రధాని అన్నారు.

**ఆ స్థాయికి భారత్ ఎదగాలి.. మోదీ :** ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత దేశం ఎదగాలని, దేశాభివృద్ధికి పాలనా సంస్కరణలు అవసరమని, అలాగే న్యాయ వ్యవస్థలో సంస్కరణలు అవసరమని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. అంతరిక్షంలో భారత్ స్పేస్ స్టేషన్ త్వరలో సాకారం కావాలన్నారు. మనం అనుకుంటే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని, 'వికసిత్ భారత్ 2047' నినాదం.. 140 కోట్ల మంది ప్రజల కలల తీర్మానమని అన్నారు. దళితులు, పీడితులు, ఆదివాసీలు గౌరవంగా బతకాలని, వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహమని, వోకల్ ఫర్ లోకల్ నినాదం ఆర్థిక వ్యవస్థలో మార్పు తెచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**ఆధునిక సాంకేతికతకు పెద్దపీట: మోదీ....** సర్జికల్ స్ట్రైక్స్‌ను దేశ ప్రజలు సగర్వంగా స్మరించుకుంటున్నారని, అభివృద్ధి బ్లూ ప్రింట్‌గా సంస్కరణలు తీసుకొస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. 'నేషన్ ఫస్ట్.. రాష్ట్ర హిత్ సుప్రీం' సంకల్పంతో ముందుకెళ్తున్నామని, బ్యాంకింగ్ రంగంలో ఎన్నో సంస్కరణలు అమలుచేశామని చెప్పారు. భారత్ బ్యాంకింగ్ వ్యవస్థ ప్రపంచంలోనే బలమైందని జల్‌జీవన్ మిషన్ ద్వారా 15 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని, భారత్‌లో చిరు ధాన్యాలు ప్రపంచంలో అందరికీ చేరాలని మోదీ ఆకాంక్షించారు. భారీ సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పం తీసుకుందని, దేశాభివృద్ధికి నూతన ఆర్థిక విధానాలు అమలుచేస్తున్నామని తెలిపారు. ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతి సాధించామని, యువతకు నూతన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్నిరంగాల్లో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేస్తామని, భారత్ త్వరలోనే ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భావిస్తుందన్నారు. స్వయం సహాయక రంగాలకు ఇప్పటి వరకు రూ.9 లక్షల కోట్ల రుణాలు ఇచ్చామని, కోటి మంది మహిళలను లక్షాధికారులుగా మారుస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

**ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి: ప్రధాని మోదీ...** అంతరిక్ష రంగంలో భారత్ బలమైన శక్తిగా ఎదిగిందని, వందల కొద్దీ స్టార్టప్‌లు వచ్చాయని, ప్రైవేట్ ఉపగ్రహాలు, రాకెట్లు ప్రయోగిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మరో 10 కోట్ల మంది మహిళలు.. కొత్తగా స్వయం సహాయక సంఘాల్లో చేరారన్నారు.

మౌలిక సదుపాయాల్లో పెను మార్పులు తీసుకొచ్చామని, దేశ హితమే ప్రథమ ప్రాధాన్యమని ఆయన అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని, మన కలలు సాకారమయ్యే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. నూతన నేర చట్టాల్లో శిక్షల కంటే న్యాయానికే ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వ ప్రమేయం అతితక్కువగా ఉండేలా పౌర సేవలు ఉంటాయని, ఎగుమతుల్లో పురోగతితో ప్రపంచ ప్రగతిలో భారత్ పాత్ర పెరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**విద్య కోసం విదేశాలకు వెళ్లే దుస్థితిని తప్పిస్తాం: మోదీ...** జీవన సౌలభ్యమే లక్ష్యంగా ప్రభుత్వ సేవలు అందాలని, ఒకప్పుడు సెల్‌ఫోన్లు దిగుమతి చేసుకునే వాళ్లమని, ఇప్పుడు భారత్‌లోనే తయారు చేసుకుంటున్నామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వైద్య విద్య కోసం లక్షలు ఖర్చుచేసి విదేశాలకు వెళ్తున్నారని, విద్య కోసం విదేశాలకు వెళ్లే దుస్థితిని తప్పిస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లలో 75వేల మెడికల్ సీట్లు రాబోతున్నాయని తెలిపారు. చంద్రయాన్ ప్ర యోగం యువతలో శాస్త్రీయ ఆసక్తిని పెంచిందని, ప్రపంచానికి సేంద్రీ య ఆహారం అందించే స్థాయికి మన రైతులు చేరాలని ప్రధాని ఆకాంక్షించారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మోదీ స్పష్టం చేశారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్ప డితే.. భయపడే పరిస్థితి తీసుకొస్తామన్నారు. ఇండియా 5Gతోనే ఆగదని.. 6Gపైనా అధ్యయనం కొనసాగుతోందని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా భారత్‌ను తయారుచేస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

**బంగ్లాదేశ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు :** ఈ సందర్భంగా బంగ్లాదేశ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ కామెంట్ చేశారు. బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు చాలా బాధాకరమని, బంగ్లాలో శాంతి నెలకొల్పేందుకు కృషిచేస్తానని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. బంగ్లా అల్లర్లతో అల్పసంఖ్యాక వర్గాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వారికి ఏం కాదని భరోసా ఇస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

## సంపాదకీయం

# విద్యుత్ ఒప్పందాలు

## కేసీఆర్ వాదనలో నిజమెంత ?

కేసీఆర్ హయాంలో తెలంగాణలో అధికారంలో ఉన్న సమయలో యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టారు. దాంతో పాటు ఛత్తీస్ ఘడ్ నుండి విద్యుత్ కొనుగోలు చేశారు. అధికధరకు విద్యుత్ కొనుగోలు చేసి అవతవకలకు పాల్పడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందు కోసం జస్టిస్ ఎల్. నరసింహారెడ్డితో జ్యుడిషీయల్ కమిషన్ ను ఏర్పాటు చేస్తూ 2024 మార్చి 14న ప్రభుత్వం జీవోను జారీ చేసింది. అయితే విద్యుత్ కొనుగోలు, విద్యుత్ కేంద్రాలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్ జీవోను రద్దు చేయాలని కోరుతూ కేసీఆర్ హైకోర్టులో పిటీషన్ వేశారు. దీనికి ముందు కేసీఆర్ ను కమిషన్ ముందు హజరు కావాలని జస్టిస్ ఎల్. నరసింహరెడ్డి కమిషన్ లేఖ రాసింది. ఈ నెల 19న కేసీఆర్ కు కమీషన్ నుండి లేఖ అందింది. వారం రోజుల్లోపుగా కమీషన్ ముందు హజరు కావాలని కోరింది. అయితే జూన్ 25తో వారం రోజుల గడువు పూర్తైంది. దీంతో మరోసారి కమిషన్ నుండి కేసీఆర్ కు లేఖ పంపారు. తన అభిప్రాయాలు చెప్పాలని ఆ లేఖలో కోరారు. కేసీఆర్ తో పాటు అప్పట్లో విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసిన జగదీష్ రెడ్డికి కూడా కమిషన్ లేఖ రాసింది. అయితే అసలు కమిషన్ ఏర్పాటునే బీఆర్ఎస్ నాయకులు తప్పుబడుతున్నారు. విద్యుత్ కొనుగోళ్లు, సరఫరా, ఒప్పందాలు, వివాదాలు అన్నీ విద్యుత్ నియంత్రణ మండలి పరిధిలోనే ఉంటాయని కేసీఆర్ చెబుతున్నారు. జ్యుడిషీయల్ కమిషన్ ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వ పరిధిలో లేదన్నది బీఆర్ఎస్ వాదన. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ చట్టంలోని 61, 62, 86 సెక్షన్లకు విరుద్ధంగా ఈ జీవో ఉందని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని జ్యుడిషీయల్ కమిషన్ ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని హైకోర్టులో కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. ఛత్తీస్ గఢ్ నుండి విద్యుత్ కొనుగోలుకు సంబంధించి అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేగా రేవంత్ రెడ్డి ఈఆర్సీలోనే తన అభ్యంతరాలను వ్యక్తం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. ఛత్తీస్ గఢ్ నుండి విద్యుత్ కొనుగోలు విషయమై జస్టిస్ ఎల్. నరసింహారెడ్డిని విచారణ కమిషన్ నుండి తప్పుకోవాలని కోరుతూ కేసీఆర్ ఈ నెల 15న లేఖ రాశారు. తొమ్మిదిన్నర ఏళ్లలో విద్యుత్ రంగంలో చేసిన కృషిని ప్రస్తావించారు. అప్పట్లో తెలంగాణలో ఉన్న విద్యుత్ కొరతను దృష్టిలో ఉంచుకొని ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వంతో పీపీఏ చేసుకున్నట్టుగా వెల్లడించారు. ఛత్తీస్ గఢ్ తో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని తప్పుబట్టే విధంగా జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్ మాట్లాడడంపై లేఖలో కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ ను దామరచర్లలో ఏర్పాటు చేయడానికి గల కారణాలను వివరించారు. విచారణ పూర్తి కాకుండానే మీడియా సమావేశంలో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తప్పుబట్టేలా జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి మాట్లాడడాన్ని తప్పుపట్టారు. విచారణ కమిషన్ నుండి తప్పుకోవాలని జస్టిస్ ఎల్. నరసింహారెడ్డిని ఆయన కోరారు. ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందంలో అవతవకలు ఎలా ఉంటాయని, ఈ లెక్కన అప్పటి చత్తీస్ ఘడ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ కు కూడా నోటీసులు ఇవ్వాలన్నది బీఆర్ఎస్ వాదన.

ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటీషన్ మీద హైకోర్టు ఎలాంటి ఆదేశాలు ఇస్తుంది అన్నది ఉత్కంఠ రేపుతున్నది.

# తూముకుంట మున్సిపాలిటీ, మూడు చింతలపల్లి, శామీర్ పేట మండలాల్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు...

## రెపరెపలాడిన మువ్వన్నెల జాతీయ జెండాలు...



శామీర్ పేట, (గరుడ వార్త) : తూముకుంట మున్సిపాలిటీ, మూడు చింతలపల్లి, శామీర్ పేట మండలాల్లో ఎంతో ఉత్సాహంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం జరుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఎంతోఉమ్మడి శామీర్ పేట మండలంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**ఊరూరా రెపరెపలాడిన మువన్నెల జాతీయ జెండాలు :** ఉమ్మడి శామీర్ పేట మండలంలో ఎంతో ఉత్సాహంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం జరుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. మూవన్నెల జాతీయ జెండాలు ఊరూరా రెపరెపలాడాయి. ఈ సందర్భంగా శామీర్ పేట మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల ప్రత్యేక అధికారి సైదులు, మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహాశీల్దార్ యాదగిరిరెడ్డి, మూడు చింతలపల్లి రెవెన్యూ కార్యాలయం వద్ద తహాశీల్దార్ వెంకటరమణారెడ్డి, మూడు చింతలపల్లి మండల పరిషత్ వద్ద వత్సల దేవి, మండల వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద ఎంఏఓ రమేశ్, మూడు చింతలపల్లి మండలం లో కృష్ణవేణి, మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ఎంఈఓ వసంత కుమారి, చిన్ననీటి పారుదల శాఖ డిప్యూటీ కార్యానిర్వహాక కార్యాలయం వద్ద డీఈఈ శ్రీనివాస్, మండల మహిళా స్నేహ బ్యాం కు వద్ద అధ్యక్షురాలు సుజాత, మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద అధ్యక్షురాలు సత్యవతి, పోలీస్ స్టేషన్ వద్ద ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, జీనం వ్యాలీ పోలీస్ స్టేషన్ వద్ద ఇన్స్పెక్టర్ యాదయ్య, రైతు సేవా సహకార సంఘం వద్ద డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ మధుకర్రెడ్డి, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వద్ద ఇన్చార్జీ వైద్యాధికారి శ్రీకాంత్, సెలబ్రెటీ రిసార్ట్స్ లో కెప్టెన్ జీజే రావు, నల్సార్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద స్టార్, చైతన్య యూత్ సభ్యులు, తెలంగాణ సాం ఘీక సంక్షేమ మహిళ డిగ్రీ గురుకుల కళాశాల వద్ద ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్, శామీర్ పేట విద్యుత్ సబ్ డివిజన్ వద్ద ఏడీఈ రమణారెడ్డి, ఏఈ సురేందర్, అలియాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్లో ఏఈ శ్రీనివాస్, వివిధ కుల సంఘాలు, ఆటో యూనియన్లు, కంపెనీల యూనియన్ నాయకులు ఎంతో ఉత్సాహంగా మూవన్నెల జాతీయ జెండాలను ఎగరవేశారు.

అలాగే శామీర్ పేట మండలంలోని తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద ఛైర్మన్ రాజేశ్వర్ రావు జాతీయ జెండాను ఘనంగా ఎగురవేశారు. కమీషనర్ వెం కటగోపాల్, మేనేజర్ శ్రావణ కుమార్, కౌన్సిలర్లు, సిబ్బంది జాతీయ జెండాకు వం దన సమర్పణ చేస్తు ఎంతో ఉత్సాహంగా జాతీయ గీతాన్ని ఆలపించారు.

**విద్యార్థులకు నోటు బుక్కులను అందజేసిన తహాశీల్దార్..** కాగా పంద్రాగస్టు వేడుకల సందర్భంగా శామీర్ పేట మండల తహాశీల్దార్ యాదగిరిరెడ్డి విద్యార్థిణిలను అభినందిస్తు నోటు బుక్కులను అందజేశారు. అలాగే తూంకుంట మున్సిపల్లో ఉత్తమ సేవలందించిన సిబ్బందిని ఛైర్మన్ రాజేశ్వర్ రావు అభినందిస్తు ప్రొత్సాహక బహుమ తులను అందజేశారు. తుర్కపల్లి లోని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఛైర్మన్ తిరుపతిరెడ్డి, కరస్పాండెంట్ వరప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరుపుకున్నారు. తుముకుంట లోని విజ్ఞాన భారతి హై స్కూల్లో కరస్పాండెంట్ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఉమ్మడి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, పలు కళాశాలలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఉత్సాహంగా నిర్వహించారు. మూవన్నెల జాతీయ జెండాలు ఊరూరా రెపరెపలాడాయి. ఈ సందర్భంగా శామీర్ పేట మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల ప్రత్యేక అధికారి సైదులు, మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహాశీల్దార్ యాదగిరిరెడ్డి, మూడు చింతలపల్లి రెవెన్యూ కార్యాలయం వద్ద తహాశీల్దార్ వెంకటరమణారెడ్డి, మూడు చింతలపల్లి మండల పరిషత్ వద్ద వత్సల దేవి, మండల వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద ఎంఏఓ రమేశ్, మూడు చింతలపల్లి మండలం లో కృష్ణవేణి, మండల విద్యా వనరుల కేం ద్రం వద్ద ఎంఈఓ వసంత కుమారి, చిన్ననీటి పారుదల శాఖ డిప్యూటీ కార్యానిర్వహాక కార్యాలయం వద్ద డీఈఈ శ్రీనివాస్, మండల మహిళా స్నేహ బ్యాం కు వద్ద అధ్యక్షురాలు సుజాత, మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద అధ్యక్షురాలు సత్యవతి, పోలీస్ స్టేషన్ వద్ద ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, జీనం వ్యాలీ పోలీస్ స్టేషన్ వద్ద ఇన్స్పెక్టర్ యాదయ్య, రైతు సేవా సహకార సంఘం వద్ద డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ మధుకర్రెడ్డి, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వద్ద ఇన్చార్జీ వైద్యాధికారి శ్రీకాంత్, సెలబ్రెటీ రిసార్ట్స్ లో కెప్టెన్ జీజే రావు, నల్సార్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద స్టార్, చైతన్య యూత్ సభ్యులు, తెలంగాణ సాం ఘీక సంక్షేమ మహిళ డిగ్రీ గురుకుల కళాశాల వద్ద ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్, శామీర్ పేట విద్యుత్ సబ్ డివిజన్ వద్ద ఏడీఈ రమణారెడ్డి, ఏఈ సురేందర్, అలియాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్లో ఏఈ శ్రీనివాస్, వివిధ కుల సంఘాలు, ఆటో యూనియన్లు, కంపెనీల యూనియన్ నాయకులు ఎంతో ఉత్సాహంగా మూవన్నెల జాతీయ జెండాలను ఎగరవేశారు. అలాగే శామీర్ పేట మండలంలోని తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద ఛైర్మన్ రాజేశ్వర్ రావు జాతీయ జెండాను ఘనంగా ఎగురవేశారు. కమీషనర్ వెం కటగోపాల్, మేనేజర్ శ్రావణ



కుమార్, కౌన్సిలర్లు, సిబ్బంది జాతీయ జెండాకు వం దన సమర్పణ చేస్తు ఎంతో ఉత్సాహంగా జాతీయ గీతాన్ని ఆలపించారు.

**విద్యార్థులకు నోటు బుక్కులను అందజేసిన తహాశీల్దార్..**

కాగా పంద్రాగస్టు వేడుకల సందర్భంగా శామీర్ పేట మండల తహాశీల్దార్ యాదగిరిరెడ్డి విద్యార్థిణిలను అభినందిస్తు నోటు బుక్కులను అందజేశారు. అలాగే తూంకుంట మున్సిపల్లో ఉత్తమ సేవలందించిన సిబ్బందిని ఛైర్మన్ రాజేశ్వర్ రావు అభినందిస్తు ప్రొత్సాహక బహుమతులను అందజేశారు. తుర్కపల్లి లోని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఛైర్మన్ తిరుపతిరెడ్డి, కరస్పాండెంట్ వరప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరుపుకున్నారు. తుముకుంట లోని విజ్ఞాన భారతి హై స్కూల్లో కరస్పాండెంట్ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఉమ్మడి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, పలు కళాశాలలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు.

# మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో

# 78వ గణతంత్ర దినోత్సవ వేడుకలు





జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ.... మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పెద్దలకు కావలసిన మౌలిక వసతుల కల్పనకు ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకుగాను ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ముందుగా దేశ స్వాతంత్రం కోసం ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు వారి జీవితాలను పణంగా పెట్టారు. వారికి, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలతో జోహార్లు అర్పిస్తున్నట్లుగా ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి అన్నారు. వారందరి త్యాగాలను స్మరించుకుంటూ ఇటువంటి జాతీయ పండుగలు నిర్వహించుకోవడం వల్ల మనందరిలో దేశభక్తి పరిఢవిల్లుతుంది. మన దేశ నిర్మాతల కలలను సాకారము చేసేందుకు మనమందరం సామరస్యం, సోదరభావముతో ముందుకు సాగుదామన్నారు. అదే స్ఫూర్తితో మన జిల్లాను అన్నిరంగాలలో దేశంలోనే ముందంజలో ఉంచడానికి అడుగులు వేద్దాం. సమగ్ర అభివృద్ధి, మెరుగైన సేవలు లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ప్రజాపాలన' కార్యక్రమం ద్వారా ప్రజల వద్ద నుండి అభయహస్తం పథకంలో భాగంగా దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుతున్నందుకు సంతోషిస్తున్నట్లుగా తెలిపారు. జిల్లాలోని 505 ప్రభుత్వ పాఠశాలలో 89 వేల 534 మంది విద్యార్థులు, మరియు జిల్లాలో వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 30 గురుకుల పాఠశాలలలో పదివేల 58 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ విద్యార్థులం దరికి నాణ్యమైన విద్యను అందించడం కొరకు ప్రభుత్వం ప్రతి విద్యార్థి మీద సగటున ఒక లక్ష రూపాయల వరకు వెచిస్తుందన్నారు. జిల్లాలోని గురుకుల పాఠశాలలలో నూతనంగా 136 మంది ఉపాధ్యాయులను నియమించడమైనది. జిల్లాలోని అన్ని పాఠశాలలలో స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో "అమ్మ ఆదర్శ పాఠశాల" కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల మెరుగుదలలో భాగంగా విద్యుత్, త్రాగునీరు, మరుగుదొడ్లకు సంబంధించిన పనులను సుమారు 12 కోట్ల రూపాయల ఖర్చుతో పూర్తి చేయడం జరిగింది. అన్ని ప్రభుత్వ విద్యాలయాలలో మౌళిక వసతులను మెరుగుపరచటం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మహిళా స్వయం సహాయక బృందాలతో కుట్టించిన రెండు జతల ఏకరూప దుస్తులను ప్రతి విద్యార్థికి అందించడం జరిగింది. పాఠ్యపుస్తకాలు, వ్రాత పుస్తకాలు, వర్క్ బుక్కులను కూడా పాఠశాల ప్రారంభ సమయంలోనే విద్యార్థులకు అందచేయడం జరుగుతుందని మహేందర్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరచడానికి, వ్యవసాయరంగ అభివృద్ధికి, రైతుల సంక్షేమాన్ని మెరుగుపరచడానికి మన ప్రభుత్వం 'పంట ఋణమాఫీ పథకం' క్రింద అర్హులైన రైతు కుటుంబాలకు 2 లక్షల రూపాయలు వరకు ఋణమాఫీ చేయటం జరుగుతున్నది. ఇప్పటివరకు జిల్లాలో రెండు విడతలలో 17.81 కోట్ల రూపాయల పంట ఋణాలను మాఫీ చేయటం ద్వారా 3094 మంది రైతులకు లబ్ధి పొందారన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి ప్రవేశపెట్టిన 'రైతుభీమా పథకం' ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో చనిపోయిన 545 రైతుల కుటుంబాలకు 27 కోట్ల 25 లక్షలు రూపాయలను నేరుగా వారి నామినీల బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగింది. జిల్లాలోని 13 వేల 734 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా మరియు భారీ పరిశ్రమలు 15 వేల 869 కోట్ల రూపా యల పెట్టుబడితో స్థాపించబడి 2 లక్షల 38 వేల 4 వందల 21 మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. నూతనముగా పరిశ్రమలు ఏర్పాటు చేసిన 6 వేల 850 మంది పారిశ్రామికవేత్తలకు వివిధ రాయితీల క్రింద 612 కోట్ల 73 లక్షల రూపాయలు మంజూరు చేయటం జరిగిందని ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి తెలిపారు. 'ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం' ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో 373 యూనిట్లకు బ్యాంకు ఋణాలు మంజూరు కాగా 338 యూనిట్లు స్థాపించబడినవి మరియు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 16 యూనిట్లను మంజూరు చేయటం జరిగిందన్నారు. యువతలో నైపుణ్యాలు అభివృద్ధి చేసే ఉద్దేశంతో మన జిల్లాలో టాటా కంపెనీ వారి సౌజన్యంతో పారిశ్రా మిక శిక్షణా సంస్థలను ఆధునీకరించడం జరుగుతున్నది. ఇందుకుగాను జిల్లాలోని అల్వాల్, మేడ్చల్ మరియు శామీర్పేట్ ఐటిఐలను ఎంపిక చేసి అందుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టడం జరిగింది. కార్యక్రమంలో ఉన్నత స్థాయి పోలీసు అధికారులు మేడ్చల్ జిల్లా అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మందుల కొరత తీరేనా..!

గోదావరిఖని పట్టణం: వర్షాకాలంలో వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం తీవ్రస్థాయిలో ఉంటోంది. అందుకు అనుగుణంగా గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి వర్గాలు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రికి ప్రతీరోజు వెయ్యికి పైగా రోగులు వస్తుండగా అందులో అత్యధికంగా జ్వరాలు, వాంతులు, విరేచనాలతో బాధపడేవారే ఉంటున్నారు. అత్యవసర వేళల్లో అవసరమైన మందులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులోకి తెచ్చామని, ఎక్కడా మందుల కొరత లేదని ప్రభుత్వం స్పష్టం చేస్తుండగా గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. డాక్టర్లు రాసే ఒకటి రెండు మినహా అన్ని మందులను బయట కొనుక్కోవాలని సిబ్బంది సూచిస్తున్నారు. ఉచిత వైద్యమని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే మళ్లీ బయట మందులు కొనుక్కోవడమేంటని పలువురు రోగులు ఫార్మసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గత కొన్ని నెలలుగా...జ్వరంతో బాధపడుతున్న వారికి ఇచ్చే ఇన్‌ఫ్లూజన్ నాలుగు నెలలుగా అందుబాటులో లేదు. ప్రత్యామ్నాయంగా అవసరమైన మందులు సైతం లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వివిధ రకాల మందులు వాడుతున్నప్పుడు తప్పనిసరిగా వాటితో పాటు పాన్‌టాప్ గోలీలు వాడుతుంటారు. ఇవి రెండు నెలల నుంచి లేవు. వ్యాధుల నివారణ కోసం వినియోగించే కీలకమైన



మందుల కొరత ఆసుపత్రిలో తీవ్రంగా ఉంది. నొప్పుల నివారణకు ఉపయోగించే డైక్లోఫాం గోలీలు, రాంటాక్, జ్వరాన్ని అరికట్టేందుకు ఉపయోగించే పారాసిటమాల్ గోలీలు సైతం లేవని రోగులు ఆరోపిస్తున్నారు. వైద్యులు రాసిన మందుల్లో అందుబాటులో లేనివాటిని మార్కు చేసి ప్రైవేటులో కొనుక్కోవాల్సిందిగా సూచిస్తున్నారు. తమపై ఆర్థిక భారం పడుతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని అందుబాటులో లేక..

సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లోనే మందుల కొరత నెలకొంది. అత్యవసరమైన కొన్ని మందులను స్థానికంగా కొనుగోలు చేసి ఇస్తున్నాం. అవసరమైన మందుల వివరాలతో ఎప్పటికప్పుడు ఇండెంట్లు పెడుతున్నాం. ఈ ప్రాంతంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సైతం కొన్ని మందులను తీసుకువచ్చి రోగులకు అందజేస్తున్నాం. కొన్ని మందులు సైతం ప్రధాన స్టోర్‌లో అందుబాటులో లేకపోవడంతో జాప్యం నెలకొంటోంది. మందుల కొరత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. –డాక్టర్ తిరుమలేశ, రెసిడెంట్ మెడికల్ అధికారిణి

# వ్యాపారంలో ముద్ర!

పెద్దపల్లి : చిన్నతరహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేం దుకు కేంద్ర ప్రభుత్వం 2015 సంవత్సరంలో 'మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ రీఫైనల్స్ ఏజెన్సీ (ముద్ర)ని ప్రారంభించింది. అప్పటి నుంచి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు రుణ అవసరాలను ఈ పథకం కింద అందజేసేవారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ప్రధాన మంత్రి ముద్ర యోజన రుణాల పరిమితిని రూ.20 లక్షల వరకు పెంచింది. సూక్ష్మ వ్యాపార యూనిట్లను పెంచడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ పథకంలో మూడు విభాగాలుగా రుణ కేటాయింపు చేస్తారు. 'శిశు' విభాగం కింద రూ.50 వేలు, 'కిషోర్' కింద రూ.5 లక్షలు, 'తరుణ్' కింద రూ.10 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తారు. వాయిదాల్లో వడ్డీ లేని రుణాన్ని క్రమపద్ధతిలో చెల్లిస్తే మరోసారి రుణ అర్హత సాధిస్తారు. తరుణ్ విభాగం కింద తీసుకున్న రుణాలను విజయవంతంగా చెల్లించినవారికి కేంద్ర బడ్జెట్‌లో పెంచిన రూ.20 లక్షల పెంపు వర్తించనుంది.

ముద్ర పథకంతో కార్పొరేట్‌యేతర, వ్యవసాయేతర చిన్న, మధ్య స్థాయి



పారిశ్రామికవేత్తలు ఆదాయాన్ని ఆర్జించే కార్యకలాపాలకు సులువైన, హామీ లేని రుణాలను అందిస్తున్నారు. బ్యాంకర్లు మొదట స్వల్ప మొత్తంతో రుణం అందించి వినియోగదారులు కోరుకున్న వాయిదాల్లో చెల్లించేలా ఖాతాలో ఆటో డెబిట్ సౌకర్యం ఏర్పాటు చేస్తారు. మొదట తీసుకున్న రుణం ఎలాంటి కొర్రీలు లేకుండా సక్రమంగా కడితే రెండోసారి రెట్టింపు మొత్తం, ఇలా గరిష్ఠంగా రుణగ్రహీత ఏర్పాటు చేసిన పరిశ్రమ, లాభాలు చూసి రుణాలు అందిస్తారు.

15 నెలల్లో రూ.124.98 కోట్లు పంపిణీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు విభాగాలు కలిపి 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 జూన్ 30 వరకు 8,656 మంది లబ్ధిదారులకు రూ.124.98 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. ఇందులో శిశు విభాగం కింద 3,707 మందికి రూ.9.05 కోట్లు, కిషోర్ విభాగం కింద 3,568 మందికి రూ.52.63 కోట్లు, తరుణ్ విభాగం కింద 1,381 మందికి రూ.63.3 కోట్లు పంపిణీ చేశారు. ఏటా సగటున ఇదే స్థాయిలో రుణాలు పంపిణీ చేస్తున్నారు. పెద్దపల్లి లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్‌ను సంప్రదించగా రుణ పరిమితి పెంపుపై ఇంకా మార్గదర్శకాలు రాలేదని చెప్పారు. లబ్ధిదారులు రుణాల చెల్లింపు బాగానే చేస్తున్నారని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# తగ్గిన సేవలు.. తనిఖీలకు తిలోదకాలు




తాండూరు : జిల్లాలో విస్తరిస్తున్న వ్యాపార, రవాణా రాకపోకలతో వాహన వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది. దీనికి అనుగుణంగా రవాణా శాఖ సేవలను విస్తరించాల్సి ఉంది. అలాంటిది ఇప్పటివరకు అందించిన సేవలను ఒక్కరోజుకు కుదించారు. వెరసి తనిఖీలు చేపట్టే వీలులేక అధికలోడు సరకు రవాణాకు అడ్డుకట్ట వేసే పరిస్థితి లేకుండా పోయింది.

**లక్షకు పైగా వాహనాల వినియోగం**

వ్యాపార కేంద్రమైన తాండూరు నియోజకవర్గంలో 3లక్షల జనాభా నివాసముంటోంది. వీరిలో లక్ష మందికిపైగా వివిధ వాహనాల్ని వినియోగిస్తున్నారు. ఉపాధి, ఉద్యోగాలకు వెళ్లే వారు, వ్యాపారులు ద్విచక్ర వాహనాలు, కార్లు వినియోగిస్తున్నారు. ప్రయాణికుల్ని తరలించేందుకు ఆటోలు, జీపులు నడుపుతున్నారు. సరకు రవాణాకు ఆటోలు, చిన్నలారీలు, లారీలు, ట్యాంకర్లు వాడుతున్నారు.

**వారంలో ఒక రోజే..**

వాహనదారులకు చోదక అనుమతుల జారీ, వాహన రిజిస్ట్రేషన్, అనుమతులు రెన్యువల్ చేయడం, వాహనాల్ని ఒకరి పేరు నుంచి మరొకరిపేరిట బదలాయింపు, వాహనాలకు సంఖ్యల కేటాయింపు సేవలను రవాణా శాఖ అధికారులు అందిస్తున్నారు. అందుకు జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరులో ఆ శాఖ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి కార్యాలయాల నుంచి అధికారులు సేవలను కొనసాగిస్తున్నారు. తొలిసారిగా తాండూరులో రవాణా శాఖ కార్యాలయాన్ని ఆరు సంవత్సరాల క్రితం అప్పటి కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా చేతుల మీదుగా ప్రారంభించారు. వారంలో రెండు రోజులు మంగళ, శుక్ర వారాల్లో కార్యాలయం ద్వారా సేవలు అందించారు. వీటిని విస్తరించాల్సి ఉండగా కుదించారు. శుక్రవారం సేవలకు విరామం ప్రకటించి మంగళవారం ఒక్కరోజే సేవలకు శ్రీకారం చుట్టారు. మిగిలిన రోజుల్లో రవాణా శాఖ అధికారులతో పనులు పూర్తి చేసుకోవాలంటే వికారాబాద్, పరిగిలోని కార్యాలయాలకు పరుగు తీయాల్సిన పరిస్థితి.

**ప్రమాదాలకు కారణమవుతున్నారు**

రహదారుల్లో తనిఖీలు విస్మరించడంతో చోదకులు ఫిట్‌నెస్‌లేని వాహనాలు నడపడం, బీమా చేయకుండా, చోదక అనుమతులు లేకుండా సరకు రవాణా వాహనాల్ని నడిపిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. నాలుగు రోజుల క్రితం బీమా చేయని లారీతో కరణ్‌కోట మార్గంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా మూడో తరగతి విద్యార్థి సంఘటన స్థలంలో దుర్మరణం చెందాడు. లారీని కొన్ని నెలల క్రితం కరణ్‌కోటకు చెందిన నాపరాయి వ్యాపారి కొనుగోలు చేశాడు. నెలలు గడిచినా పాత యజమాని పేరుతో లారీని నడుపుతున్నారు.

**ఒక్కరోజులో పరిష్కరిస్తున్నాం**

ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్ని మంగళవారం కార్యాలయానికి వచ్చి పరిష్కరిస్తున్నాం. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వస్తే మరో రోజు వచ్చి కార్యాలయంలో సేవలు అందించే వీలుంటుంది. ప్రస్తుతం దరఖాస్తుదారులకు ఒక్క రోజులో పనులు పూర్తి చేస్తున్నా. వీరేంద్రనాయక్, ఎంవీఐ, తాండూరు.

# నిత్యావసరాలు ధరలు పైపైకి




పెద్దపల్లి : రోజురోజుకూ నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. డీజిల్, పెట్రోల్, బియ్యం, పప్పులు, కూరగాయల ధరలు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. మరోవైపు నిత్యావసర వస్తువుగా మారిన ఫోన్ రీఛార్జ్‌కు సంబంధించి అన్ని ప్రముఖ టెలికాం సంస్థలు సైతం అమాంతం ధరలు పెంచడమే కాకుండా గతంలో 28 రోజులకు టారిఫ్ ఉంటే ప్రస్తుతం 20 రోజులకే పరిమితం చేశాయి. ఇవన్నీ పేద, మధ్య తరగతి వర్గాల వారి ఆర్థిక స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రభుత్వ పరంగా చౌకధరల దుకాణాల ద్వారా నిత్యం అవసరమయ్యే ఈ సరకులను రాయితీ ధరలకు విక్రయించి దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న ప్రజలను ఆదుకోవాల్సి ఉన్నప్పటికి కేవలం దొడ్డు బియ్యం ఉచితంగా ఇచ్చి చేతులు దులుపుకొంటోంది. చక్కెర, గోధుమలు వంటివి అంత్యోదయ అన్నపూర్ణ కార్డులున్నవారికి మాత్రమే అప్పుడప్పుడూ పంపిణీ చేస్తున్నారు. పీఎంసీ (ప్రైస్ మానిటరింగ్ కమిటీ) దాదాపుగా రెండేళ్లుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సమావేశాలు నిర్వహించడం లేదు. పెరిగిపోతున్న ధరలు నియంత్రించేందుకు ఏ కమిటీ సక్రమంగా పనిచేయడం లేదు.ధరల పర్యవేక్షణ కమిటీకి ఛైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా పౌరసరఫరాల అధికారి వ్యవహరిస్తారు. అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన, మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల శాఖ సంస్థ డీఎం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు నిత్యావసర సరకులతో సంబంధం ఉన్న అధికారులు సభ్యులుగా ఉంటారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ కమిటీ ప్రతినెలా సమావేశం నిర్వహించి ధరలు, విక్రయాలపై చర్చించాలి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి సరకులు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలి. ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటే ప్రభుత్వ పరంగా కేంద్రం ఏర్పాటు చేయించి ప్రజలకు సరకులు విక్రయించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు సిండికేట్ అవుతుండటంతో ధరలు అమాంతం పెరుగుతున్నాయి. రిటైల్ వ్యాపారుల వద్ద సిండికేట్ లేకపోవడం, ఒకరు తక్కువ ధరల్లో, మరొకరు ఎక్కువ ధరల్లో విక్రయిస్తుండటంతో అక్కడక్కడా ధరల పెరుగుదలలో వ్యత్యాసం కనిపిస్తోంది. బియ్యం, నూనె, ఉల్లిగడ్డ, పప్పులను వ్యాపారులు గోదాముల్లో నిల్వ చేసి ధరలు పెరుగుతుండే క్రమంలో ఎక్కువ ధరలతో విక్రయిస్తుంటారు.

బియ్యం నాణ్యతను బట్టి వ్యాపారులు ధర అమాంతం పెంచేస్తున్నారు. ఈ ధరలు రెండు నెలలుగా పెరుగుతూనే ఉన్నాయి.

భారత్ బియ్యం బస్తా కనిపించడం లేదు

సన్నబియ్యం మార్కెట్‌లో కిలో రూ.65 వరకు ఉంటోంది. కేంద్రం కిలో రూ.29కే భారత్ రైస్ పేరుతో పదికిలోల బస్తాలను మార్కెట్‌లో విక్రయిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఎక్కడా కనిపించడం లేదు. అప్పుల్లో బతకాల్సి వస్తుంది. ధరల నియంత్రణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మహేందర్, చిరుద్యోగి, శాంతినగర్

రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయాలి

నెలకు రూ.5 వేల వరకు ఖర్చు చేస్తే తప్ప నెలవారీ సామగ్రి వచ్చేలా కనిపించడం లేదు. కూరగాయలకు వారానికి రూ.500 వరకు వెచ్చించాల్సి వస్తుంది. గతంలో 9 రకాల వస్తువులను రేషన్ దుకాణాల్లో రాయితీ ధరలకు ఇచ్చేవారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి.– రజిత, గృహిణి, పెద్దపల్లి


# ఆత్మ నిర్భర్ చెంత.. చిరు వ్యాపారి నిశ్చింత

వికారాబాద్ : జిల్లాలోని పురపాలికల్లో చిరు వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆత్మ నిర్భర్ భారత్ స్వనిధి' పథకం వరంలా మారింది. తీసుకున్న రుణం చెల్లిస్తే అందులో మరింత జమ చేసి కొత్తగా రుణం అందజేస్తున్నారు. అంతే కాకుండా కొంత వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరిస్తోంది. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ఇచ్చే రుణాన్ని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. తద్వారా మరింతగా సాయాన్ని పొంది వ్యాపార విస్తరణకు కృషి చేయవచ్చని బ్యాంక్ అధికారులు వివరిస్తున్నారు. రుణం సద్వినియోగమయ్యే విధంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కృషి చేస్తోంది.

గుర్తింపు కార్డు ఉంటే చాలు: 2020లో వచ్చిన కరోనా కారణంగా ఇబ్బంది పడకుండా చిరు వ్యాపారులకు తగిన చేయూతనందించటానికి ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఎలాంటి హామీ పత్రాలు లేకుండా కేవలం వెండర్ గుర్తింపు కార్డు అర్హతతో వీధి వ్యాపారులకు 2020లో వ్యక్తిగత ఖాతాకు రూ.10,000 జమ చేశారు. సకాలంలో రుణాలు చెల్లించిన వారికి రూ.20,000, తరువాత రూ.50,000 ఇచ్చారు.

జిల్లాలోని మొత్తం వీధి వ్యాపారులు.. 9,717

కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు జనాభాలో 5 శాతం వీధి వ్యాపారులను ఈ పథకానికి గుర్తించాలి. ఈ లెక్కన జిల్లాలోని నాలుగు పురపాలికల్లో 9,717 మంది వీధి వ్యాపారులను గుర్తించారు. వారిలో 7,890 మంది దరఖాస్తు చేసుకోగా ప్రతి ఒక్కరికీ కార్డు జారీ చేశారు. జిల్లాలో మూడో విడత రుణాల పంపిణీ ప్రస్తుతం నడుస్తోంది. ఆగస్టు 1 నాటికి మూడో విడతలో 730 మందికి రుణాలు ఇవ్వాలన్న లక్ష్యాన్ని



నిర్ణయించగా 1030 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో 926 మందికి అందజేశారు.

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి..

– రవికుమార్, మెప్మా జిల్లా అధికారి.

ఆత్మ నిర్భర్ స్వనిధి పథకం చిరు వ్యాపారులకు ఆర్థికంగా వరం. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. సక్రమంగా రుణం చెల్లించిన వారికి తిరిగి సులభంగా రుణాన్ని బ్యాంకుల ద్వారా ఇప్పిస్తున్నాం. వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా రుణం పొంది ఆర్థికంగా బలోపేతం కావచ్చు.

# సాగు లేదు.. పరిహారం రాదు

సారంగాపూర్: రోళ్లవాగు ప్రాజెక్టు పాత కట్టకు గండి పడి రైతుల పంట పొలాలు కొట్టుకుపోయి రెండేళ్లు గడిచినా పరిహారం అందక ఇప్పటికీ పలు భూములు బీళ్లుగానే మారాయి. నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకుంటామన్న నాయకుల, అధికారుల మాటలు నీటి మూటలే అయ్యాయి. పంట పొలాల్లో వరద ప్రభావంతో ఇసుక మేటలు, కోతకు గురై భూములు పాడయ్యాయి. ఒక్కో రైతు భూమిని చదును చేసుకొని, బావి, విద్యుత్తు మోటారు అమర్చుకునేందుకు కనీసం ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీర్‌పూర్ మండలంలో 730 ఎకరాల్లో 330 మంది రైతుల భూములు కొట్టుకుపోయినట్లు అప్పట్లో వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా తయారు చేశారు. అంతేకాకుండా వరద తాకిడికి విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు పడిపోయాయి. దీనివల్ల ట్రాన్స్‌కోకు రూ.కోటి వరకు నష్టం వాటిల్లినప్పటికీ ప్రస్తుతం మరమ్మతు చేశారు. ఆర్థికంగా ఉన్న రైతులు ప్రస్తుతం సొంతగా భూములు చదును చేసుకుని సాగు చేసుకుంటుండగా పలువురు అలాగే వదిలేసి, పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.

ఉపాధి కోల్పోయిన మత్స్య కారులు

రోళ్లవాగు ప్రాజెక్టులో మత్స్య సంపదపై ఆధారపడి వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రాజెక్టు పరిధిలోని బీర్‌పూర్, నర్సింహులపల్లె, పోతారం గ్రామాలకు చెందిన దాదాపు 300 మంది మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. ఏటా ప్రభుత్వం 5 లక్షల చేప పిల్లలను పంపిణీ చేస్తే మరో 6 లక్షల వరకు సొంతగా కొనుగోలు



చేసి ప్రాజెక్టులో పెంచుకునే వారు. ప్రాజెక్టులో నీరంతా పోవడంతో దాదాపు 100 టన్నుల చేపలు కొట్టుకుపోయాయి. దీంతో రూ.కోటి వరకు నష్టం జరిగింది. ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో మత్స్యకారులకు పరిహారం అందక, ఉపాధి లభించక అవస్థలు పడాల్సిన పరిస్థితి.

రూ.4 లక్షలతో చదును

రూ.3.50 లక్షలు పెట్టి భూమి, వ్యవసాయ బావిని తవ్వుకొని సాగు చేసుకుంటున్న సమయంలో రోళ్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో వరదతో భూమిలో పెద్దపెద్ద బండరాళ్లు, ఇసుక మేటలు వేశాయి. ఏడాది పాటు కోలుకోని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ రూ.4 లక్షలు పెట్టి బండరాళ్లు తొలగించి, వ్యవసాయ బావి, భూమిని చదును చేసుకొని సాగు చేసుకుంటున్నాను. ఇప్పటికీ అధికారులు కనీసం సర్వే చేయకపోవడమే కాకుండా ప్రభుత్వం నుంచి నయాపైసా పరిహారం అందలేదు.– తాడుక మల్లేశం, నర్సింహులపల్లె

# లియో పట్టేస్తోంది..!

కరీంనగర్ : ప్రస్తుతం రాష్ట్రంలో గంజాయి వ్యాపించి యువతను పట్టిపీడిస్తోంది. దీన్ని అరికట్టేందుకు పోలీసుశాఖ ప్రత్యేకంగా నార్కోటిక్స్ విభాగానికి శిక్షణతో కూడిన జాగిలాన్ని అందించి గంజాయి రహిత రాష్ట్రంగా ప్రకటించాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే కరీంనగర్ కమిషనరేట్లో కొత్త నార్కోటిక్స్ విభాగం ఏర్పాటుకాగా.. అధికారులతో సమానంగా ఆ జాగిలానికి సైతం మంచి గుర్తింపు అందుతోంది.మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి మధ్యవర్తుల ద్వారా గంజాయి జిల్లాకు సరఫరా అవుతోంది. పోలీసులు ప్రత్యేక తనిఖీ ద్వారా గంజాయిని కట్టడి చేస్తున్నా.. ఏదో ఒకచోట విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. దీనికి సంబంధించిన పక్కా సమాచారం రాబట్టేందుకు పోలీసు శాఖకు ప్రత్యేకంగా కేటాయించిన లియో(జాగిలం).. ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి జిల్లా సరిహద్దుకు వచ్చే గంజాయిని పోలీసు జాగిలం సహాయంతో పట్టుకోనున్నారు.

రూ.10 వేల గౌరవ వేతనం..

లియోకు నాలుగు నెలల వయసున్నప్పుడే మత్తు పదార్థాలను గుర్తించేందుకు ప్రత్యేక శిక్షణ కేటాయించడానికి నియమించారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని కానిస్టేబుల్ శంకర్.. 8 నెలలపాటు లియోతో ప్రత్యేక శిక్షణ పొందారు. జాగిలానికి రూ.10 వేల గౌరవ వేతనం కేటాయించారు. ఆ డబ్బులతోనే లియోకు భోజనం ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద పోలీసులు జాగిలంతో ప్రత్యేక తనిఖీ చేపట్టి గంజాయిని పట్టుకున్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ ప్రస్తుతం ముమ్మరం చేశారు.

సమాచారమిస్తే వివరాలు గోప్యం గంజాయి, మత్తుపదార్థాల విక్రయాలపై ఎలాంటి సమాచారమున్నా 87126 71111 నంబర్‌కు వివరాలు తెలియజేయాలి. వచ్చిన సమాచారంపై పూర్తి స్థాయి సమాచారం సేకరించి నిందితులను పట్టుకుంటున్నాం. గంజాయి రహిత జిల్లాగా నిలపాలనే లక్ష్యంతో కరీంనగర్ పోలీసుశాఖ పని చేస్తోంది. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. – మాధవి, ఏసీపీ, నార్కోటిక్స్ విభాగం కరీంనగర్

# విరుల 'ధర'హాసం

మేడిపల్లి: శ్రావణమాసం, వరలక్ష్మీ వ్రతం, శుభకార్యాల నేపథ్యంలో ఆగస్టులో ఇళ్లు విరుల శోభను సంతరించుకుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపూర్, కర్ణాటకలోని సిక్‌బల్లాపూర్, కోలార్, మహారాష్ట్రలోని నాందేడ్, ముఖేడ్ సహా హైదరాబాద్ నుంచి జగిత్యాలకు నిత్యం వివిధ రకాల పూలు వస్తున్నాయి. సాధారణ రోజుల కంటే రెట్టింపుగా అమ్ముడవుతుండగా ప్రస్తుత శ్రావణమాసంలో 2 నుంచి 4 టన్నుల వరకు విక్రయిస్తున్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పూలతో పాటు తమలపాకులకూ డిమాండ్ ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లోని తుని నుంచి జగిత్యాలకు వస్తున్న తమలపాకుల ధర గతంలో 100కు రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100 వరకు ఉంటోంది. జిల్లా కేంద్రంలోని వారు సహా వివిధ మండలాల నుంచి జగిత్యాలకు వస్తున్న వారు శ్రావణమాసం సహా శుభకార్యాల కోసం విరివిగా పూలు కొంటున్నారు. జిల్లాలోని ఆలయాలు కూడా ఈ మాసంలో భక్తులతో కిటకిటలాడుతుండగా డిమాండ్ పెరిగింది.

# వినియోగంలోకి వచ్చేదెన్నడో?

కోరుట్ల: పట్టణాల్లో కూరగాయలు, మాసం, పూలు, పండ్ల దుకాణాలు రోడ్లపై ఎక్కడెక్కడో ఉంటాయి. వీటన్నింటినీ కలిపి ఒకేచోట ఏర్పాటు చేయిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని ప్రభుత్వం 2021-22 సంవత్సరంలో ఏకీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం జీవో నం.65 ద్వారా బల్దియాలకు ప్రత్యేక నిధులను విడుదల చేసింది. వీటితోపాటు పురపాలక సంఘంలో ఉన్న పట్టణ ప్రగతి నిధులను కేటాయించారు. వీటి నిర్మాణం కోసం మొదట్లో పట్టణాల్లో స్థలం సమస్య తలెత్తగా ఎట్టకేలకు స్థలాలను కేటాయించి రెండేళ్ల క్రితం పనులను ప్రారంభించారు. ఇప్పటివరకు సగానికిపైగా పనులు పూర్తయ్యాయి. మిగతా పనులకు నిధులు అందుబాటులో లేకపోవడంతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఏకీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణాల్లో సుమారు రూ.10 కోట్ల విలువగల పనులు పూర్తి చేయగా ఇప్పటివరకు గుత్తేదారుకు కేవలం రూ.3.30 కోట్ల బిల్లులు మాత్రమే చెల్లించారు. దీంతో గుత్తేదారు పనులు చేపట్టేందుకు ఆసక్తి కనబర్చడం లేదని సమాచారం.

**నిధుల కేటాయింపే కీలకం..**

నిధులు లేకపోవడంతో ఏకీకృత మార్కెట్‌లను అసంపూర్తిగా వదిలేయడంతో రైతులు, వ్యాపారులు కూరగాయలు, మాసం దుకాణాలు రోడ్ల పక్కనే ఏర్పాటు చేసుకొని విక్రయాలు చేపడుతున్నారు. దుమ్మూధూళి, ఈగలతో అవి కలుషితమవుతున్నాయి. ప్రభుత్వం పాతబకాయిలు చెల్లించి, మిగతా పనులకు కావాల్సిన నిధులను విడుదల చేస్తేనే ఏకీకృత మార్కెట్‌ల నిర్మాణాలు పూర్తయ్యి పట్టణ ప్రజలకు



అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. లేకుంటే అవి అసంపూర్తిగా మిగిలిపోనున్నాయి. మార్కెట్ల పనులను త్వరలోనే పూర్తి చేస్తామని, ఇప్పటికే పూర్తయిన వాటిని ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కోరుట్ల మున్సిపల్ డీఈఈ అభినయ్‌కుమార్ తెలిపారు.

: జగిత్యాల పట్టణంలో ఏకీకృత మార్కెట్ నిర్మాణం కోసం మొత్తం రూ.9.6 కోట్ల నిధులు కేటాయించారు. రెండేళ్ల క్రితం పనులను ప్రారంభించి రెండు రేకులతో భారీ షెడ్లను నిర్మించి రంగులు వేయించారు. ఇందులో వెజ్, నాన్‌వెజ్, పూలు, పండ్ల దుకాణాల ఏర్పాటు కోసం 100 దుకాణాల (స్టాల్స్)ను నిర్మించారు. మార్కెట్ చుట్టూ ప్రహరీ, నీటి సౌకర్యం, మురుగు కాలువలు, అంతర్గత రోడ్లు, పార్కింగ్, మూత్రశాలలు, స్వాగతతోరణం, ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. కోరుట్ల పట్టణ శివారులోని వ్యవసాయ మార్కెట్‌యార్డు స్థలంలో ఏకీకృత మార్కెట్ నిర్మాణానికి రూ.7.35 కోట్లు కేటాయించారు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి రెండు భారీ షెడ్లను నిర్మించారు. వీటికి నాలుగు నెలల క్రితం రంగులను సైతం వేయించారు. వివిధ రకాల మొత్తం 134 దుకాణాలను నిర్మించారు. పైప్‌లైన్, విద్యుత్తు పనులను పూర్తి చేశారు. ఇంకా ఇతర చాలా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. మెట్‌పల్లి పట్టణంలో ఏకీకృత మార్కెట్ నిర్మాణాల కోసం ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో ఖాదీబోర్డు స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. అందులో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ల నిర్మాణాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం మొత్తం రూ.10.85 కోట్లు కేటాయించారు. రెండు బ్లాక్‌లుగా విభజించి రెండేళ్ల క్రితం పనులను ప్రారంభించారు. రెండు భవనాల స్లాబ్‌లు నిర్మించి అందులో మొత్తం 136 స్టాళ్లను నిర్మించాల్సి ఉంది. ఇంకా మార్కెట్‌ల చుట్టూ ప్రహరీ, రోడ్లు, నీటి, విద్యుత్తు సౌకర్యం, పార్కింగ్, మూత్రశాలలు, ఇతర చాలా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

# వ్యవసాయ మార్కెట్ల ఆదాయ లక్ష్య నిర్దేశం

జమ్మికుంట : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ మార్కెట్ల ఆదాయ లక్ష్యాన్ని అధికారులు నిర్ణయించారు. మార్కెట్లకు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పాత బకాయిలు జమకావటం, వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు, గిడ్డంగుల అద్దెలు, లైసెన్స్‌లు, చెక్‌పోస్టులతో ఆదాయం లభిస్తుండగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆదాయ లక్ష్యాన్ని మార్కెటింగ్ శాఖ అధికారులు తేల్చారు. దీంతో ఆయా మార్కెట్ల ఆదాయాన్ని లక్ష్యం మేర సాధించేందుకు అధికారులు పనిలో పడ్డారు.

ఉమ్మడి జిల్లాలో రూ.64.68 కోట్లు

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ మారెట్లకు 2024-25లో ఆర్థిక సంవత్సరంలో ఆదాయం లక్ష్యాన్ని రూ.64.68 కోట్లుగా నిర్ధారించారు. కరీంనగర్ జిల్లాలోని 8 వ్యవసాయ మార్కెట్లకు రూ.24.47 కోట్లుగా, రాజన్న సిరిసిల్లలోని 10 వ్యవసాయ మార్కెట్లకు రూ.10.17 కోట్లు,



జగిత్యాల జిల్లాలోని 13 వ్యవసాయ మార్కెట్లకు రూ.15.98 కోట్లు, పెద్దపల్లి జిల్లాలోని 8 వ్యవసాయ మార్కెట్లకు రూ.14.05 కోట్లుగా ఆదాయ లక్ష్యాన్ని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. ఎన్నికలు, పలు కారణాలతో లక్ష్యం నిర్దేశించడం ఆలస్యమైంది. లక్ష్యం మించి ఆదాయాన్ని రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

జమ్మికుంట మార్కెట్‌దే అధికం

వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ రూ.8.08 కోట్లు ఆదాయం సాధించాలని లక్ష్యం పెట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మార్కెటింగ్ శాఖ జమ్మికుంట మార్కెట్‌కు రూ.7.64 కోట్ల ఆదాయ లక్ష్యం నిర్ణయించగా.. నిర్ణీత లక్ష్యాన్ని అధిగమించి రూ.9.78 కోట్లు సాధించటం విశేషం. పాత బకాయిలు జమకావటం తదితర కారణాలతో జమ్మికుంట మార్కెట్ లక్ష్యాన్ని అధిగమించి ఆదాయం రాబట్టింది. తాజాగా ఏప్రిల్ నుంచి జూన్ నెల నాటికి 38 శాతం ఆదాయ లక్ష్యాన్ని సాధించింది. ఉమ్మడి జిల్లాలోని మార్కెట్‌లలో మొత్తం కలిపి రూ.22.21 కోట్లు(34శాతం) వసూలు అయ్యాయి.

# సారొచ్చారా.. ఆపరేషన్ చేస్తారా..?



హైదరాబాద్ : వానలు కురుస్తుండటంతో ప్రధాన ఆసుపత్రులకు రోగుల తాకిడి గణనీయంగా పెరిగింది. ఆ స్థాయిలో సేవలు మాత్రం అందడం లేదు. ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒకేచోట నాలుగేళ్ల కంటే ఎక్కువ ఏళ్లు ఉన్న వైద్యులను బదిలీ చేయడం.. వారి స్థానంలో ఇంకా కొత్తవాళ్లను నియమించలేదు. అత్యవసర చికిత్సలు తప్పా.. ఇతర శస్త్రచికిత్సలు వాయిదా వేస్తున్నారు. 20 రోజులు ఆపైనే నిరీక్షణ తప్పడం లేదని రోగులు వాపోతున్నారు. బదిలీలైన స్థానాల్లో 10శాతం కూడా రాలేదు. ఈ నేపథ్యంలో పరిశీలించింది.

ఉస్మానియా ఆసుపత్రి: జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీలో ఆరుగురు చొప్పున ప్రొఫెసర్లు ఉండగా.. రెండు విభాగాల్లో నలుగురేసి బదిలీ అయ్యారు. అనస్థీషియాలో అయిదు పోస్టులకు ఒక్కరే మిగిలారు. ఈ ప్రభావం సర్జరీలపై పడుతోంది. బయోకెమిస్ట్రీ, ఫోరెన్సిక్, ఫిజియాలజీ, ఫార్మకాలజీ విభాగాల్లో ఉన్న 12మంది ప్రొఫెసర్లు బదిలీపై వెళ్లారు. రోజూ 1600 పైనే ఓపీ ఉంటోంది. 150-180 సర్జరీలు చేస్తుంటారు. అత్యవసర సేవల్లో సైతం సకాలంలో చికిత్సలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

గాంధీ ఆసుపత్రి: జనరల్ సర్జరీలో ఆరుగురు, గైనకాలజీలో ముగ్గురు, ఫోరెన్సిక్, ఫార్మకాలజీలో ఇద్దరు చొప్పున ప్రొఫెసర్లు ఉండగా అందరూ బదిలీ అయ్యారు. జనరల్ మెడిసిన్‌లో ఆరుగురు ప్రొఫెసర్లుంటే అయిదుగురిని, అనాటమీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీలో ఇద్దరేసి ప్రొఫెసర్లకు ఒకరు చొపున్న బదిలీ అయ్యారు. అనస్థీషియాలో ముగ్గురు ప్రొఫెసర్లుండగా ఒక్కరే మిగిలారు. నిత్యం 1500 పైనే ఓపీతోపాటు 150 వరకు సర్జరీలు జరుగుతుంటాయి.

నిలోఫర్: ఇక్కడ 13మంది పిడియాట్రిక్ ప్రొఫెసర్లకు 8 మందిని బదిలీ చేశారు. ఇద్దరినే నియమించారు. గైనకాలజీలో ఐదుగురు, రేడియాలజీలో ఇద్దరు, మైక్రోబయాలజీలో ఇద్దరు, అనస్థీషియాలో ముగ్గురు వెళ్లారు. అనస్థీషియాలో అందరూ వెళ్లడంతో ఆపరేషన్లపై ప్రభావం పడుతోంది. నిత్యం 700-1000 వరకు ఓపీ ఉంటోంది.

ఫీవర్ ఆసుపత్రి: ఇటీవలి బదిలీల్లో ముగ్గురు ప్రొఫెసర్లు, అసోసియేట్ ఒక్కరు, మరో ఏడుగురు వైద్యులు, ముగ్గురు ఫార్మాసిస్టులు, 21 మంది నర్సులు.. మొత్తం 35 మంది వెళ్లిపోయారు. ఇందులో సగం మందిని కూడా తిరిగి నియమించలేదు. ప్రస్తుతం ఆరేడు వందల మంది నిత్యం ఆసుపత్రిని సందర్శిస్తుంటారు.

పేట్లబుర్జు: ప్లేట్లబుర్జు ప్రసూతి ఆసుపత్రిలో 500 వరకు పడకలుంటే.. 700 మంది వరకు చికిత్సలు అందిస్తుంటారు. ఐదుగురు ప్రొఫెసర్లకు ముగ్గురే ఉన్నారు. ఆరుగురు అసోషియేట్ ప్రొఫెసర్లకు నలుగురిని బదిలీ చేశారు. 26 మంది అసిస్టెంట్లకు 5గురే ఉన్నారు. రోజూ 500 ఓపీ, 50 వరకు డెలివరీలు చేస్తుంటారు.

# వానాకాలం సాగుకు బెంగ లేదిక



బోయినపల్లి : రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయంలో మొన్నటి వరకు నీరు లేక వెలవెలబోయింది. తాగు నీటి అవసరాల మేరకు మాత్రమే నీరు ఉండేది. ఎల్లంపల్లి జలాలు రాకతో ప్రస్తుతం జలాశయం జలకళను సంతరించుకుంది. తాగు నీటితోపాటు సాగు నీటి అవసరాలకు బెంగ తీరుతుంది. వానాకాలం పంటలపై అన్నదాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నీటి నిల్వ పెరగడంతో అన్నపూర్ణ జలాశయానికి కూడా తరలిస్తున్నారు. త్వరలో దిగువ మానేరుతోపాటు కుడి, ఎడమ కాలువలకు విడుదల చేయనున్నారు.

బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద ఉన్న రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 27.5 టీఎంసీలు. దీనికి ఎస్సారెస్పీ, కాళేశ్వరం, ఎల్లంపల్లి నీరే ప్రధాన ఆధారం. మధ్యమానేరు నుంచి దిగువన ఎల్‌ఎండీతోపాటు కుడి, ఎడమ కాలువలు, అన్నపూర్ణ జలాశయం, మల్కపేట రిజర్వాయర్, రాజరాజేశ్వరస్వామి దేవస్థానం గుడి చెరువు, మిషన్ భగీరథకు నీరు వెళ్తుంది. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతుల వల్ల మధ్యమానేరుకు నీరు రాని పరిస్థితి ఉంది. ఇటు ఎస్సారెస్పీలోనూ ఆశించిన స్థాయిలో నీరు లేకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.ఎల్లంపల్లి జలాల రాకతో...

ఎల్లంపల్లి జలాశయానికి ఎగువ నుంచి నీరు రావడంతో నంది, గాయత్రి పంపు హౌస్‌ల నుంచి వరద కాలువ ద్వారా మధ్యమానేరుకు 3,150 క్యూసెక్కులు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు 13.46 టీఎంసీలు వచ్చింది. వర్షాలకు మానేరు, మూలవాగుల నుంచి 1.73 టీఎంసీలు వచ్చింది. నీటి నిల్వ పెరుగుతుండటంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నపూర్ణ జలాశయానికి 6,400, కుడి కాలువకు 100 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు. ఇప్పటి వరకు అన్నపూర్ణకు 3.76 టీఎంసీలు తరలించారు. జలాశయానికి ఇన్‌ఫ్లో స్థిరంగా కొనసాగుతుండటంతో సాగు నీటి కోసం దిగువ మానేరు జలాశయంతోపాటు ఎడమ కాలువలకు నీటి విడుదల చేయనున్నారు. వరద కాలువ ద్వారా నీరు వస్తుండటంతో కాలువ వెంబడి వరి నాట్లను రైతులు పూర్తి చేసుకున్నారు. ఎల్లంపల్లి జలాలు రావడంతో వానాకాలం సాగుకు ఇబ్బందులు తొలగినట్లేనని రైతులు చెబుతున్నారు. కాగా జలాశయానికి గత ఏడాది కాళేశ్వరం, ఎస్సారెస్పీ, మానేరు, మూలవాగుల నుంచి 49.57 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది. ఇదే సమయంలో 58.54 టీఎంసీల నీటిని వదిలారు. గత ఏడాది ఆగస్టులో 20.28 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

11 ఎకరాల్లో వరి వేశా

నాకు 11 ఎకరాల పొలం ఉంది. బోరులో నీరు అంతంత మాత్రంగానే ఉంది. గ్రామ శివారులోని కాలువ నుంచి పైపులైన్ ఏర్పాటు చేసుకొని మోటారుతో నీటిని పొలానికి అందిస్తుంటాను. ప్రస్తుతం మధ్యమానేరు నుంచి అన్నపూర్ణ జలాశయానికి నీటిని తరలిస్తుండటంతో సమస్య తీరింది. సమీపంలోని బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి.

– సుదర్శన్‌రెడ్డి, రైతు, ఓబులాపూర్

ఆదేశాలు వస్తే దిగువకు విడుదల

జలాశయంలో నీటి నిల్వ పెరగడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నపూర్ణ జలాశయం, కుడి కాలువకు నీటి విడుదల కొనసాగుతుంది. ఎల్ఎండీ, ఎడమ కాలువకు విడుదల చేయాలని ఆదేశాలు అందితే చర్యలు తీసుకుంటాం.

– జగన్, ఈఈ, మధ్యమానేరు జలాశయం

# మీ సమస్యలు తెలపండి..

గోదావరిఖని: కార్మికుల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు సింగరేణి యాజమాన్యం మూడేళ్ల తర్వాత గ్రీవెన్స్‌డే నిర్వహిస్తోంది. కార్మికులు తమ సమస్యలను అధికారుల ముందు విన్నవించేందుకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంది. మూడేళ్ల క్రితం ప్రస్తుత సీఎండీ, అప్పటి డైరెక్టర్(పా) బలరాం 2021 సెప్టెంబరులో గ్రీవెన్స్‌డేను ప్రతి ఏరియాలో నిర్వహించారు. ఆ సమయంలో భారీ ఎత్తున కార్మికుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. అనేక సమస్యలు వారి ద్వారా వెల్లడయ్యాయి. 2021 కంటే ముందు 2019లో అప్పటి డైరెక్టర్(పా) పవిత్రన్‌కుమార్ పనిచేసిన సమయంలో కూడా గ్రీవెన్స్‌డే నిర్వహించారు. తాజాగా మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడంతో తమ సమస్యలను విన్నవించుకునే అవకాశం లభించిందని కార్మికులు భావిస్తున్నారు. గనుల్లో ఎదురయ్యే సమస్యలతో పాటు నివాస గృహాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా వాటిని పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది.

నాలుగు డివిజన్ల ఉద్యోగులు, కార్మికులు

గతంలో రెండుసార్లు నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వచ్చిన విజ్ఞప్తులపై సమీక్ష ఎంత వరకు జరిగిందన్న అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా మంగళవారం రామగుండం రీజియన్ కార్మికులకు సమస్యలు విన్నవించుకునే అవకాశాన్ని యాజమాన్యం కల్పించింది. రామగుండం ప్రాంతంలోని ఆర్జీ-1, 2, 3, ఏపీఏ డివిజన్‌లకు చెందిన ఉద్యోగులు, కార్మికులు గోదావరిఖనిలోని సింగరేణి జీఎం కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌డేకు హాజరు కావాలని ప్రకటించింది. నాలుగు డివిజన్‌లకు సంబంధించిన



కార్మికులు, ఉద్యోగులు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకునే అవకాశం కల్పించింది. విజ్ఞప్తులను స్వీకరించిన అనంతరం వాటిపై సమీక్షించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం ద్వారా ఉద్యోగులు మరిన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉంటుంది.

సంక్షేమంపై సీఎండీ దృష్టి

సింగరేణిలో ఉద్యోగుల సంక్షేమంపై సీఎండీ బలరాం దృష్టి సారించారు. గతంలో ఆయన డైరెక్టర్(పా)గా పనిచేసిన సమయంలో ఉద్యోగులు తమ సమస్యలు విన్నవించుకునే అవకాశాన్ని కల్పించాలని గ్రీవెన్స్‌డేను ప్రారంభించారు. ఒక్కో ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. స్వయంగా ఆయన ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో మరోసారి దీనిని చేపట్టేందుకు ఆదేశించారు. దీంతో కార్మికులు ఎక్కడి వారు అక్కడే తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఏర్పడింది.

# బతికేలా నాటేద్దాం.. భవిత మారుద్దాం

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఎనిమిది విడతలుగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో లక్షలాది మొక్కలు నాటిన విషయం తెలిసిందే. ఈ సంవత్సరం వన మహోత్సవం పేరిట నాటే ప్రతి మొక్క బతికించే బాధ్యతను ప్రభుత్వం అధికారులకు అప్పగించింది. ఈ సారి మండలాలకు లక్ష్యాలను తక్కువగానే ఇచ్చారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు సమన్వయంతో స్థలాలను పరిశీలించి మొక్కలు నాటేందుకు అనువుగా ఉన్న వాటిని గుర్తించారు. నర్సరీల్లో అవసరమైన మొక్కలను సిద్ధం చేశారు. యాదాద్రి భువనగిరిలో సోమవారం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. సూర్యాపేటలో ఈ నెల 18న, నల్గొండలో వారం రోజుల్లో అధికారికంగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటుతున్నారు.

లోపాలను అధిగమిస్తేనే పచ్చదనం

గతంలో ఖాళీ స్థలాల్లో, ప్లాట్ల ముందు, విద్యుత్తు తీగల కింద మొక్కలు నాటించారు. దీంతో మొక్కలు నాటే

లక్ష్యం చేరినా.. ఫలవంతం కాని పరిస్థితి. ప్లాట్ల ముందువారు ఆదిలోనే తొలగించగా, విద్యుత్తు తీగల కింద నాటినవి ఏపుగా పెరిగిన తర్వాత



తీగలకు అడ్డొస్తున్నాయని ఆ శాఖ అధికారులు కొట్టేస్తున్నారు. ఈ సారి వీటి నుంచి బయట పడేందుకు ముందుగానే ఏపీవోలు, సాంకేతిక సిబ్బంది, ఈసీలు, క్షేత్ర సహాయకులు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థలాలను ఎంపిక చేశారు. ఎన్ని మొక్కలు నాటవచ్చో ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ఈసారి ఇళ్లల్లో, గట్లపై, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు స్థలాల్లో, గతంలో ఎండిన చోట, విద్యుత్తు తీగల కింద మొక్కలు నాటడం లేదు.

లక్ష్యం మేరకు సన్నద్ధం:సతీష్, డీఎఫ్‌వో, సూర్యాపేట

వన మహోత్సవంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు అన్ని మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీల్లో లేని మొక్కలను బయట నుంచి తెప్పిస్తున్నాం. వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలకు సరిపోయే విధంగా నర్సరీల్లో సిద్ధం చేస్తున్నాం. పండ్లు, పూలు, ఇతర మొక్కలు ఉండేలా చూసుకుంటున్నాం.

నాటుతున్న మొక్కలివి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు 130.95 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. వర్షాలు కురుస్తుండటంతో ఇప్పటికే 41.25 లక్షల మొక్కలు నాటారు. వన మహోత్సవంలో పండ్ల, నీడనిచ్చే మొక్కలు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ప్రధానంగా స్థానిక వాతావరణానికి అనుకూలంగా పెరిగే వాటిని ఎంపిక చేసుకున్నారు. గుర్తించిన స్థలాల్లోనే వాటిని నాటేలా సన్నాహాలు చేపడుతున్నారు.

# మిల్లుల్లో ధాన్యం ఉందా..?

కామారెడ్డి : ప్రభుత్వం రైస్‌మిల్లులకు ప్రతి ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యాన్ని అందిస్తుంది. మిల్లులతో ఒప్పందం కుదుర్చుకుని బియ్యాన్ని తీసుకుంటుంది. అయితే కొందరు మిల్లర్లు ధాన్యాన్ని సొంత అవసరాలకు వాడుకుని నిల్వలు లేకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. రెండు మిల్లులపై కేసులు కూడా నమోదు చేశారు. ఇవే కాకుండా మరికొందరు మిల్లర్లు కూడా ధాన్యాన్ని మాయం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాలనాధికారి రంగంలోకి దిగారు. అన్ని మిల్లులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం వారివద్ద ఉందో లేదో చూడాలని ఆదేశించారు. ఒకవేళ మిల్లుల్లో ధాన్యం లేకుంటే సదరు యజమానికి తాఖీదులు జారీ చేయాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారి ఆదేశాలతో క్షేత్రస్థాయి తనిఖీలకు పౌరసరఫరాలశాఖ అధికారులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

**మూడు సీజన్ల నుంచి..**

ప్రభుత్వం నుంచి తీసుకున్న మూడు సీజన్ల ధాన్యం ప్రస్తుతం మిల్లుల్లో ఉంది. ఇందులో 2022-23 ఏడాదికి సంబంధించిన యాసంగి సీజన్ ధాన్యానికి అప్పటి ప్రభుత్వం గ్లోబల్ టెండర్లు ఆహ్వానించింది. టెండర్ నిర్వాహకులు మొన్నటి వరకు ధాన్యాన్ని తీసుకువెళ్లలేదు. అది మిల్లుల్లోనే మూలుగుతోంది. గ్లోబల్ టెండర్ నిర్వాహకులు ఆయా మిల్లుల నుంచి ధాన్యాన్ని తీసుకువెళ్లడం ఖర్చుతో కూడిన పనిగా భావించినట్లు తెలుస్తోంది. అందుకే ఎవరి మిల్లుల్లో ఎంత ధాన్యాన్ని టెండర్‌లో దక్కించుకున్నారో ఆ ధాన్యాన్ని అదే మిల్లు యజమానికి ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జిల్లాలో కొందరు మిల్లర్లు ఆ ధాన్యానికి డబ్బులు కూడా చెల్లిస్తున్నారు. అయితే గ్లోబల్ టెండర్ వారు దక్కించుకున్న ధాన్యాన్ని కొందరు మిల్లర్లు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ వారు ఇటీవల జిల్లాలోని భిక్కనూరు, పల్వంచ, సదాశివనగర్ మండలాల్లోని మూడు మిల్లుల్లో తనిఖీ చేసి నివేదిక రూపొందించారు. ఇది కాకుండా 2022-23 వానాకాలం సీజన్, 2023-24 యాసంగి సీజన్ ధాన్యం మిల్లుల్లో ఉంది. ఈ నిల్వలు సరిగా ఉన్నాయో లేదో తనిఖీల్లో వెల్లడికానుంది.

**నోటీసుల జారీ..**

2021-22 వార్షిక ఏడాదిలో 31 మంది మిల్లర్లు లక్ష్యం మేర బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకపోవడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. 2022-23 ఏడాదిలో కూడా 36 మంది మిల్లర్లకు నోటీసులు జారీ అయ్యాయి. కొందరు మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లుగా తెలుస్తోంది. రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తిరిగి ప్రభుత్వానికి సీఎంఆర్‌గా అందజేస్తున్నారు. ప్రస్తుతం అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తే ఎంత మంది వద్ద ధాన్యం నిల్వలు ఉంది లేనిది బహిర్గతమవుతుంది.

## రుణమాఫీపై రైతుల్లో ఆందోళన

జగిత్యాల : ఆగస్టు 15 లోపు రైతులకు ఒకే దఫాలో రూ. 2 లక్షల వరకు పంటరుణాన్ని మాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటున్నా కటాఫ్ తేదీలపైనే అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో రైతుకు గరిష్ఠంగా రూ.లక్ష వరకు పంటరుణాన్ని మాఫీచేసినపుడు జిల్లాలోని రైతులకు రూ. 390 కోట్ల వరకు లబ్ధి చేకూరింది. ఈ మొత్తాన్ని 4 భాగాలుగా విభజించి రైతుల ఎస్‌బీ ఖాతాలకు విడుదల చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం రెండోసారి 2018 డిసెంబరు 11వ తేదీకన్నా ముందు పంట రుణం అసలు, మిత్తి కలిపి రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని ప్రకటించగా జిల్లాలోని 1,02,119 మంది రైతులకు రూ. 711.62 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని తొలుత గుర్తించారు. ప్రభుత్వం రూ. 25 వేలలోపు రుణంగల వారికి ఒకదఫా, రూ. 99,999 వరకు మరోదఫా నిధులను విడుదల చేసింది. లక్షపైన ఎంత రుణమున్నా రూ.లక్ష చొప్పున 2023 సెప్టెంబరు నెలాఖరు వరకు చెల్లింపులు పూర్తిచేస్తామని



ప్రకటించింది. నిధుల విడుదలను ఆలస్యం చేయటం, శాసనసభ ఎన్నికల ప్రకటన రావటంతో ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో జిల్లాలోని 56 వేల మంది రైతులకు మాత్రమే రూ. 295 కోట్ల వరకు నిధులందాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఒక్కో రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2014 వరకు ఒకసారి, 11.12.2018 తేదీ వరకున్న రుణాలను మరోసారి మాఫీచేసినందున 12.12.2018 తేదీ నుంచి 9.12.2023 వరకు పంటరుణాలను మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కటాఫ్ తేదీ విధించిన మధ్యకాలంలో తీసుకున్న రుణాలనే మాఫీ చేస్తారా లేక అంతకుముందు రుణం తీసుకుని రెన్యూవల్స్ చేసుకున్న వారికీ వర్తింపచేస్తారా, రెండో విడతలో మాఫీ నిధులు రానివారిని పరిగణనలోకి తీసుకుంటారా అనే అంశాలపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు 2023 డిసెంబరు 9 వరకు జిల్లాలో దాదాపు 1.25 లక్షల మంది రైతులు రూ. 950 కోట్లవరకు పంటరుణాలు పొందినట్లు అంచనా. గతంలో నిధులందక తాము నష్టపోయామని, ఈ సారి అలా జరగకుండా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు. రుణమాఫీపై నిబంధనలు వెల్లడికావాల్సి ఉందని డీఏవో వాణి తెలిపారు.

## మత్తు.. చేస్తోంది చిత్తు

మేడిపల్లి : బంగారు భవిష్యత్తు కలిగి ఉండాల్సిన యువకుల్లో పలువురు చెడు మార్గాల వైపు ఆకర్షితులవుతున్నారు. మత్తుకు అలవాటు పడి గంజాయి అలవాటు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పాఠశాల స్థాయిలోనే బాల బాలికలు గంజాయికి అలవాటు పడుతుండటం ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. డ్రగ్స్ నియంత్రణకు పలు సూచనలు చేశారు. ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసులను ఆదేశించారు. పోలీసులు వివిధ జిల్లాల్లో డ్రగ్స్ రవాణా, అమ్మకాలపై నిఘా పెంచడంతో యువకులే ఈ మహమ్మారికి కారణమని తెలుసుకుని విస్తుపోతున్నారు. పోలీసులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగంపై కౌన్సెలింగ్ నిర్వహించాలని, దీని నియంత్రణకు ప్రతిఒక్కరూ పాటు పడాలని కోరుతున్నారు. మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా గంజాయి అమ్మకాలు, దుష్ప్రభావాలపై కథనం.



పదం, పాదం కదిపితేనే నిర్మూలన..

గంజాయి మూలంగా యువకులు చిన్న వయసులోనే అనారోగ్యాలకు గురవుతారని వైద్యులు చెబుతున్నారు. మత్తు పదార్థాలు తీసుకొని యువకులు వాహనాలను అతివేగంగా నడపడం.. దాడులు, హత్యలకు పాల్పడటం జరుగుతోందని పోలీసులు పేర్కొంటున్నారు. గంజాయి లాంటి వాటిని విక్రయించేందుకు చెడు సావాసాలు, అక్రమ మార్గాలపై దృష్టి పెడుతుండటంతో సమాజంలోనూ వారు చిన్నచూపునకు గురవుతున్నారు. నరాల బలహీనత తదితరాలతో యువకుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుండటంతో చిన్న వయసులోనే యువత మృత్యువాత పడే అవకాశముందని వైద్యులు పేర్కొంటున్నారు. నివారణే మార్గంగా ప్రతి ఒక్కరూ పదం, పాదం కదిపితేనే గంజాయి లాంటి వాటిని సమాజం నుంచి దూరం చేయొచ్చంటున్నారు.

బాధిత కుటుంబాల్లో తీరని ఆవేదన

ఉమ్మడి జిల్లాలో యువత గంజాయి మత్తులో చిత్తవుతున్న ఘటనలు ఆయా కుటుంబాల్లో వేదన కలిగిస్తున్నాయి. చాలామంది వివిధ ప్రాంతాల నుంచి గంజాయి తెస్తూ విక్రయానికి పాల్పడుతుండగా పాఠశాల స్థాయిలోని చిన్నారులు కూడా గంజాయికి అలవాటు పడ్డారు. పలు ప్రాంతాల్లో పోలీసులు నిఘా ఉంచి బాలబాలికలకు గంజాయి విక్రయించేవారిని అరెస్టు చేసేందుకు యత్నిస్తున్నా కొందరు నిందితులు చిక్కడం లేదు. కరీంనగర్ జిల్లా ముగ్దుంపూర్‌లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను గోదావరిఖని ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. ఇంటర్‌తో చదువు మానేసిన యువకులు జల్సాలకు, గంజాయికి అలవాటుపడినట్లు పోలీసులు గుర్తించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనలతో భద్రాచలం నుంచి వీరు గంజాయి కొనుగోలు చేసి స్థానికంగా విక్రయిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మే నెలలో మంథని పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరిని, ముత్తారం స్టేషన్ పరిధిలో నలుగురు యువకులను అరెస్టు చేశారు. జగిత్యాల జిల్లా రాయికల్, మల్లాపూర్ మండలాలకు చెందిన అయిదుగురు యువకులు జల్సాలకు అలవాటుపడి చదువు మానేసి ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి చిన్న చిన్న ప్యాకెట్లలో గంజాయి సరఫరా చేస్తూ పోలీసులకు చిక్కారు.

# విపత్తులో దన్ను.. ఆక్రమణలపై మూడో కన్ను



హైదరాబాద్: రాజధాని చుట్టుపక్కల ప్రభుత్వ భూముల ఆక్రమణలను నిరోధించలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ప్రకృతి విపత్తు సంభవించినపుడు ఎదుర్కొనే పెద్ద వ్యవస్థ మహానగరంలో లేదు. ఈనేపథ్యంలో భూముల రక్షణ, విపత్తు స్పందన సంస్థ (అసెట్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్)ను ఏర్పాటు చేయాలని సర్కార నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షణలో సంస్థ పని చేయనుంది. ఐజీ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో ఇద్దరు ఎస్పీలు, పలు విభాగాల అధికారులతో కలిపి మొత్తం 3 వేల మంది ఇందులో పని చేయనున్నారు. ప్రభుత్వ భూముల రక్షణకు ఈ సంస్థ కీలకంగా మారనుంది. గత ప్రభుత్వ హయాంలో బల్దియా కమిషనర్ ఆధ్వర్యంలో పని చేసేలా ఎన్‌ఫోర్సుమెంట్, విజిలెన్సు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం)ను ఏర్పాటు చేశారు. దీనికి ఐపీఎస్ అధికారిని డైరెక్టర్‌గా నియమించింది. దీనికింద 900 మంది సిబ్బంది ఉన్నా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. రాజధాని చుట్టూ రూ.వేల కోట్ల విలువైన ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి. వాటిని కాపాడే వ్యవస్థ లేదు. ఈనేపథ్యంలో సరికొత్త సంస్థను ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు. ఇందులో భాగంగానే అసెట్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థ రూపుదిద్దుకుంది. దీనికి సంబంధించి విధివిధానాలతో జీవో త్వరలో రానుందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ఈ సంస్థ స్వయం ప్రతిపత్తితో పని చేయనుంది.

7 జిల్లాల పరిధిలో..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మెదక్, సిద్ధిపేట జిల్లాల పరిధిలో ఈ సంస్థ పని చేస్తుంది. మొత్తం 70 మండలాలు విస్తరించి ఉంది. జీహెచ్‌ఎంసీతోపాటు నిజాంపేట, బండ్లగూడ జాగీర్, బడంగ్‌పేట, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్, మీర్‌పేట నగరపాలక సంస్థలు, 30 పురపాలక సంఘాలు దీని పరిధిలోకి వస్తాయి.

సమర్థులైన అధికారుల కోసం..

కొత్త సంస్థలో పని చేయడానికి సమర్థులైన అధికారుల కోసం సర్కారు అన్వేషణ చేస్తోంది. ఐజీ ఏవీ రంగనాథ్‌ను ఈ సంస్థ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇద్దరు ఎస్పీ ర్యాంకు అధికారులు, ఇతర విభాగాల అధికారులను నియమించనున్నారు.

నూతన సంస్థ చేసే పనులివీ

బల్దియా, హెచ్‌ఎండీఏ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యతను నూతనంగా ఏర్పాటు చేయనున్న 'భూముల రక్షణ, విపత్తు స్పందన సంస్థ' తీసుకోబోతుంది. ప్రభుత్వ భూములు ఎక్కడ ఆక్రమణకు గురయ్యాయో గుర్తించి స్వాధీనం చేసుకోనుంది.

రాజధానిలో చిన్నాపెద్దా నాలుగు వేల వరకు చెరువులున్నాయి. కొన్ని ఆక్రమణకు గురికాగా మరికొన్నింటిపై ఆక్రమణదారులు కన్నేశారు. ఈ నేపథ్యంలో ఈ చెరువుల రికార్డులను వెలికితీసి ఆక్రమణల నుంచి కాపాడుతుంది. బల్దియా, హెచ్‌ఎండీఏ విజిలెన్సు విభాగాలను కొత్త సంస్థలో విలీనం చేయనున్నారు. అక్రమ నిర్మాణాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోనుంది. మహానగరంలో భారీవర్షం పడితే ప్రధాన రోడ్లు చెరువుల్లా మారిపోయి ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఈ నేపథ్యంలో సంస్థలోని సిబ్బంది ఆధునిక యంత్రాలతో రోడ్లపైకి వస్తారు. రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలపై సైతం చర్యలు తీసుకుంటారు. ఈ సంస్థకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేయనున్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెండు అంతస్తులను కేటాయించనున్నారు.

## మేల్కొనకపోతే.. నిత్య నరకమే



హైదరాబాద్: రోడ్లు ఎంత విశాలంగా ఉన్నా.. వాహన రద్దీని తట్టుకోలేకపోతున్నాయి. 150 అడుగుల, 100 అడుగుల రహదారులైనా నిత్యం కిక్కిరిసిపోతున్నాయి. కొత్తగా నిర్మించిన పైవంతెనలు, అండర్‌పాస్‌లు, ఆర్‌యూబీలతో సమస్య కొంత వరకే పరిష్కారమైంది. అదే సమయంలో కొత్త ట్రాఫిక్ చిక్కులూ తెరపైకొచ్చాయి. ఈ నేపథ్యంలో ఇష్టానుసారం చేపడుతోన్న అభివృద్ధి పనులు, నిర్మాణ అనుమతులే నగరానికి శాపంగా మారుతున్నాయనే విమర్శలొస్తున్నాయి. ట్రాఫిక్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ చేపట్టి, గుర్తించిన సమస్యలకు పరిష్కారాలను కనిపెడితేనే నగరం భవిష్యత్తు బాగుంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఇవిగో ఉదాహరణలు.. జేఎన్‌టీయూ కూడలి నుంచి గచ్చిబౌలి ఓఆర్‌ఆర్ వరకు రహదారి వెడల్పు 100 నుంచి 150 అడుగులు ఉంది. అయినా వాహనాలు బారులు తీరుతున్నాయి. జేఎన్‌టీయూ నుంచి మలేషియన్ టౌన్‌షిప్ వరకు పైవంతెన, అయ్యప్ప సొసైటీ, మైండ్‌స్పేస్ కూడళ్లలో అండర్‌పాస్‌లు, మరో రెండు పైవంతెనలను నిర్మించిన విషయం తెలిసిందే.

మెహిదీపట్నం నుంచి టోలిచౌకి మీదుగా గచ్చిబౌలి వెళ్లే వాహనాలు ముక్కుతూ.. మూలుగుతూ వెళ్తున్నాయి. ఈ దారిలో పైవంతెన అందుబాటులోకి వచ్చినప్పటికీ.. దానిపై వెళ్లిన వాహనాలన్నీ ఖాజాగూడ చౌరస్తా నుంచి వెనక్కి ఆగుతున్నాయి. టోలిచౌకిలో రోడ్డు ఆక్రమణలు రద్దీకి కారణమవుతున్నాయి.

భారీ నిర్మాణాలతోనూ మూసాపేట నుంచి కైత్లాపూర్ వెళ్లే రోడ్డు వంద అడుగుల వెడల్పు ఉంటుంది. ఇక్కడ నాలుగు ఆకాశహర్మ్యాల ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటికే నాలుగు పూర్తయ్యాయి. తక్కువ ప్రదేశంలో వేలాది ఇళ్ల నిర్మాణం జరిగింది, వారంతా కార్లతో రోడ్లపైకి వస్తే.. మున్ముందు ఎలా ఉండనుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

దృష్టిపెట్టిన సర్కారు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నగర యంత్రాంగం ఇప్పటికే ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టింది. మూడు కమిషనరేట్ల పరిధిలో 127 కూడళ్ల విస్తరణకు జీహెచ్‌ఎంసీ ఆమోదం తెలిపింది. అయితే బల్దియా వద్ద నిధుల్లేవు. సర్కారు నుంచి విడుదల వ్వట్లేదు. నిధుల సమస్యను తీర్చి, ట్రాఫిక్ సమస్యపై అధ్యయనం చేయించి, నిర్మాణ అనుమతులపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రైవేటు బడుల్లో నిబంధనలు బేఖాతర్



పెద్దపల్లి : ప్రైవేటు విద్యాలయాలు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. విద్యా హక్కు చట్టం నియమ నిబంధనలను బేఖాతరు చేస్తూ పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ప్రైవేటు బడుల్లో విద్యార్థులకు చదువు మాత్రమే చెప్పాల్సి ఉంటుంది. అదనంగా ఎలాంటి పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు, బ్యాగుల పేరిట పాఠశాలలోనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేయవద్దని స్పష్టంగా మార్గదర్శకాలు జారీ చేసినా జిల్లావ్యాప్తంగా ఎక్కడా వీటిని అమలు చేయడం లేదు. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా విద్యా హక్కు చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి.

పట్టించుకునేవారేరీ.. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఏవీ విక్రయించొద్దనే అధికారిక ఆదేశాలున్నాయి. దీంతో విద్యాసంస్థల నిర్వాహకులు కొత్త దారి ఎంచుకుంటున్నారు. తమ పాఠశాల సమీపంలో ఉండే ఓ గృహ సముదాయాన్ని తాత్కాలికంగా అద్దెకు తీసుకుని అందులోనే పాఠశాల పేరుతో ఉండే స్టేషనరీ సామగ్రిని విక్రయిస్తున్నారు. తమ వద్ద చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల రుసుం కట్టిన తర్వాత ఓ చిట్టీపై చదువుకోవడానికి అవసరమైన సమస్త జాబితాను రాసి అద్దె భవనానికి వెళ్లి కొనుగోలు చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో ప్రముఖ ప్రైవేటు పాఠశాలలన్నీ ఈ పంథానే అనుసరిస్తున్నాయి. నర్సరీ నుంచి పదో తరగతి వరకు అన్నీ పుస్తకాలు, దుస్తులు, ఇతర సామగ్రి అంతా దర్జాగా ఇక్కడే విక్రయిస్తున్నారు. ఎల్‌కేజీ విద్యార్థికి రూ. 3వేల వరకు పుస్తకాలకే వసూలు చేస్తున్నారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థికి అదనంగా ఐఐటీ తరగతుల పేరిట ఒక్కో పుస్తకాన్ని రూ. 650 పెట్టి వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, దుస్తులు, పరీక్షల రుసుంలు అదనంగా వసూలు చేస్తున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎంఈవోలతో తనిఖీ చేయిస్తాం

ప్రైవేటు పాఠశాల్లో అనుమతులు, వసతుల కల్పన, ఫీజుల నియంత్రణ అంశాలపై ఆయా మండల విద్యా శాఖ అధికారుల(ఎంఈవో)తో తనిఖీలు చేయిస్తాం. నిబంధనలు పాటించని పాఠశాలల అనుమతులు రద్దు చేస్తున్నాం. ఇప్పటికే గోదావరిఖనిలోని సప్తగిరికాలనీలోని ఓ ప్రైవేటు బడిని సీజ్ చేశాం. తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తాం. మాధవి, జిల్లా విద్యా శాఖ అధికారి

## ఆగని దందా.. అదే పంథా

కరీంనగర్ : 'ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేస్తాం. మానేరు వాగుతో పాటు ఇతర వనరుల నుంచి ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కుల భరతం పడతాం. దీని వెనుక ఏ నాయకుడున్నా వదిలిపెట్టం. సహకరిస్తున్న పోలీసులు, అధికారులను గుర్తించి వారిపై కఠిన చర్యలుండేలా మా పోరాటం ఉంటుంది.' ముస్తాబాద్ మండలం నామాపూర్ శివారులో మంగళవారం ఇసుక మాఫియా దుశ్చర్యలో ఓ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. పట్టుబడిన ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చుని వస్తుండగా, డ్రైవర్ దాన్ని చెరువులోకి మళ్లించి తను దూకేశాడు.

రెండు రోజుల కిందట వేములవాడ మూలవాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా అడ్డుకున్న మైనింగ్ అధికారితో ట్రాక్టర్ల డ్రైవర్లు దురుసుగా ప్రవర్తించడంతో పాటు ఆపకుండా వెళ్లేందుకు యత్నించారు. తమకు అడ్డు రావద్దంటూ అధికారితో వాగ్వాదానికి దిగారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇసుక దందా పంథా మారడం లేదు. క్షేత్ర స్థాయిలో వేళ్లూనుకుపోయిన మాఫియా.. దర్జాగా దౌర్జన్యానికి పాల్పడుతోంది. ఇసుకాసురులపై కఠిన చర్యలు లేక రెచ్చిపోతున్నారు. అక్రమ రవాణాతో జేబులు నింపుకొంటూ అడ్డొచ్చినవారిపై దాడులకు పాల్పడుతున్నారు. మానేరు, మోయతుమ్మెద, మూల వాగులు, గోదావరి నది పరీవాహక ప్రాంతాల నుంచి రాత్రింబవళ్లు సహజ వనరులను దోస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిత్యం దాదాపు 4 వేలకు పైగా ట్రాక్టర్లలో టన్నుల కొద్దీ ఇసుక తరలిస్తుండటంతో ఆందోళన కలిగిస్తోంది. పోలీసు, రెవెన్యూ అధికారుల ఉదాసీనతకు తోడు స్థానిక నాయకుల అండతో



దందా కొనసాగుతోంది.

యంత్రాంగం ప్రేక్షక పాత్ర

ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. పదే పదే ఫిర్యాదు వస్తే మొక్కుబడిగా కేసు నమోదు చేసి వదిలేస్తున్నారు. వాస్తవానికి వాల్టా(నీరు నేల వృక్షం చట్టం) ఉల్లంఘించే వారిని ఆయా శాఖల అధికారులు సమష్టిగా కట్టడి చేయాలి. కానీ ఎవరికి వారు 'తమకెందుకులే' అన్న ధోరణితో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక దందాపై చోటామోటా నాయకుల పైరవీలు, నేతల ఒత్తిళ్లతో యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. విచ్చలవిడిగా ఇసుక రవాణాతో రహదారి ప్రమాదాలు పెరిగాయి. మైనర్లు ట్రాక్టర్లను నడిపిస్తుండటం పరిపాటిగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఏటా ఇసుక ట్రాక్టర్లతో దాదాపు 200 వరకు ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు ఘటనల్లో ద్విచక్రవాహనదారులు మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు, ఆర్టీఏ, మైనింగ్ శాఖల అధికారులు స్పందించి సమష్టిగా ఇసుక దందాకు అడ్డుకట్ట వేయకుంటే మున్ముందు మరింత రెచ్చిపోయే ప్రమాదం లేకపోలేదు.


పరీవాహకంలో అదే ఆదాయం జలాశయాలు, నీటి పరీవాహక ప్రాంతాలు అధికంగా ఉన్న నాలుగు జిల్లాల్లో వందలాది మందికి ఇసుక రవాణా ఆదాయ మార్గంగా మారింది. అధికారిక రీచ్‌లు ఉన్నా వందలాది ట్రాక్టర్లలో దొడ్డి దారిన తరలిస్తున్నారు.

వర్షాకాలంలో వాగులు, వంకల్లో నీళ్లు నిలవకముందే అందినకాడికి దోచుకోవాలన్న ఆలోచనతో కొద్ది రోజులుగా అక్రమార్కులు జోరు పెంచారు. డీజిల్, కూలీల ఖర్చులు పోగా ట్రాక్టర్ ఇసుక విక్రయంతో రూ. 1500–2000 సంపాదన వస్తుండటంతో చాలా మంది ఈ వ్యాపారానికి అలవాటు పడ్డారు. నది, వాగు పరీవాహక ప్రాంత గ్రామాల్లో వందల సంఖ్యలో ట్రాక్టర్లను కేవలం ఇసుక రవాణా కోసమే కొనుగోలు చేస్తున్నారు. పలు చోట్ల సిండికేట్‌గా మారి ప్రతి రోజు ఒక్కో వాహనం 6–10 ట్రిప్పులు తరలించుకునేలా ఒప్పందాలు చేసుకొని దోపిడీకి పాల్పడుతున్నారు. కొందరు రాజకీయ నాయకులు ఈ మాఫియాకు పెద్దలుగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకోవడం, మామూళ్లు ఇవ్వడం వంటి పనులను వీరు చక్కబెడుతుంటారు. ఎక్కడైనా, ఎవరైనా ఫిర్యాదు చేసినా బెదిరించడం, దాడికి పాల్పడటం వంటి చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

## వ్యయం తగ్గి.. వెలుగులు పంచేలా

తూప్రాన్: విద్యుత్తు ఖర్చులు తగ్గించుకునేందుకు తూప్రాన్ పురపాలిక అధికారులు ప్రత్యామ్నాయ చర్యలకు శ్రీకారం చుట్టారు. కార్యాలయానికి సౌర విద్యుత్తు అందించేందుకు సర్వం సిద్ధం చేశారు. రూ. 20లక్షలకు పైగా నిధులతో కార్యాలయంపై సౌర పలకలను ఏర్పాటు చేశారు. పురపాలిక కార్యాలయంతో పాటు విభాగినులపై ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలకు నెలకు రూ. 2లక్షల వరకు కరెంటు బిల్లులు వస్తున్నాయి. ఈ వ్యయాన్ని తగ్గించుకునేందుకు అధికారులు ఆలోచనలు చేశారు. జిల్లా కలెక్టర్ అనుమతితో రూ. 20.60లక్షల నిధులతో సౌర పలకల యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా పురపాలిక కార్యాలయం, విభాగినులపై ఏర్పాటు చేసిన దీపాలకు సైతం విద్యుత్తును వినియోగించేలా ప్రణాళికలు చేశారు. ప్రస్తుతం కార్యాలయంపై సౌర పలకల బిగింపు పూర్తయ్యింది. త్వరలోనే దీనిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

రూ. 24లక్షలకు పైగా ఆదా తూప్రాన్ పురపాలికలో నెలకు రూ. 2లక్షలకు పైగా విద్యుత్తు బిల్లులను చెల్లిస్తున్నారు. ఇలా ఏడాదికి రూ. 24లక్షలకు పైగా వ్యయం అవుతోంది. సౌర పలకల ద్వారా ఏడాదిలో ఈ వ్యయం పూర్తికానుంది. 5 ఏళ్ల వరకు గ్యారంటీ ఉండగా 30ఏళ్ల వరకు వినియోగంలో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో దీని ద్వారా ఉత్పత్తి అయ్యే మిగులు విద్యుత్తును సైతం విద్యుత్తు శాఖకే విక్రయించేందుకు వెసులుబాటు ఉంది. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలపై వీటిని ఏర్పాటు చేయగా పురపాలిక కార్యాలయంపై ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు. ఇది విజయవంతమైతే ఉమ్మడి జిల్లాలోని అన్ని పురపాలిక కార్యాలయాలపై దీనిని ఏర్పాటు చేసేందుకు ఆలోచనలు చేస్తున్నారు. ఈ వారం రోజుల్లోనే దీనిని ప్రారంభించి సోలార్ ద్వారానే విద్యుత్తు వెలుగులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం బిల్లులు అధికంగా రావడంతో కొన్ని విద్యుత్తు దీపాలను సైతం పూర్తిగా ఆన్ చేయడం లేదు. ప్రస్తుతం ఆ ఇబ్బందులు తొలగనుండటంతో రాత్రి సమయంలో నిరంతరం పురపాలికలో విద్యుత్తు వెలుగులు విరజిమ్మనున్నాయి. సద్వినియోగం చేసుకుంటాం: ఖాజామొయినొద్దీన్, కమిషనర్ పురపాలిక, తూప్రాన్‌తూప్రాన్ పురపాలిక కార్యాలయంపై రూ. 20లక్షలకు పైగా నిధులతో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తును పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటాం. ప్రధానంగా పురపాలిక కార్యాలయంలో విద్యుత్తు బిల్లులను ఆదా చేసేందుకే దీనిని ఏర్పాటు చేశారు. దీని నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తాం.




పేదలకు పట్టెడన్నం పెట్టే మంచి కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. గుడివాడ వేదికగా రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు అన్న క్యాంటీన్లకు డిజిటల్ విరాళాలివ్వొచ్చని చంద్రబాబు చెప్పారు. విరాళాలు అందజేసేందుకు ఏర్పాటు చేసిన బ్యాంక్ ఖాతా నెంబరు, ఇతర వివరాలను ఆయన వెల్లడించారు. అవి ఈ కింది విధంగా ఉన్నాయి. SBI Bank Name-ANNA CANTEENS A/C - 37818165097 IFSC - SBIN0020541 Branch - Chandramouli Nagar City - Guntur




బంగ్లాదేశ్ లో హిందువుల సురక్షితపై భారతీయులు ఆందోళనలో ఉన్నారని ప్రధాని మోదీ అన్నారు. ఆయన నేడు 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. "బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువుల భద్రత విషయంలో 140 కోట్ల మంది భారతీయులు ఆందోళనలో ఉన్నారు. భారత్ ఎప్పుడూ బంగ్లాదేశ్ పురోగతిని ఆశించే శ్రేయోభిలాషి. త్వరలోనే అక్కడి పరిస్థితులు సాధారణస్థితికి వస్తాయని ఆశిస్తున్నాను. అక్కడ ఉన్న మైనార్టీలు, హిందువుల సురక్షితను భారత్ కోరుకుంటోంది" అని ప్రధాని తన ప్రసంగంలో పేర్కొన్నారు.

**ప్రధాని ప్రసంగంలోని కీలక అంశాలు ఇవీ..** పలు రంగాల్లో మహిళలు నాయకత్వ బాధ్యతలు చేపడుతున్నారని ప్రధాని పేర్కొన్నారు. అయినా ఇటీవల కొన్ని పరిణామాలు తనను ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. "మన తల్లులు, సోదరీమణులపై జరుగుతున్న దాడులపై ప్రజల్లో ఆందోళన ఉంది. దానిని నేను అర్థం చేసుకొంటాను. దీనిని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో పాటు సమాజం కూడా తీవ్రంగా పరిగణించాలి. మహిళలపై దాడుల కేసులను వేగంగా దర్యాప్తు చేయాలి. నిందితులకు కఠిన శిక్షలు విధించాలి. ఇది సమాజంలో నమ్మకాన్ని పెంచుతుంది" అని వెల్లడించారు. "మన విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఉండాలని కోరుకోను. మధ్యతరగతి వర్గాలు పిల్లల విద్యపై ఇందుకోసం రూ.లక్షలు ఖర్చు పెడుతున్నాయి. మన యువత ఇక్కడే చదువుకొనేలా విద్యావ్యవస్థను అభివృద్ధి చేయాలి. విదేశీయులే ఇక్కడికి వచ్చి చదువుకొనేలా ఉండాలి. మనం బిహార్‌లో నలందా విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరించాం. కానీ, విద్యావ్యవస్థలో శతాబ్దాల నాటి నలందా స్ఫూర్తిని తిరిగి నిలబెట్టాలి" "ఓకల్ ఫర్ లోకల్' ఆత్మనిర్భర్‌కు కీలక మంత్రం' 'మనం భవిష్యత్తు కోసం చేపట్టే ప్రతీ కార్యక్రమంలో దేశాన్ని అత్యున్నతంగా తీర్చిదిద్దడమనేది లక్ష్యంగా ఉండాలి' 'సుప్రీం కోర్టు యూనిఫామ్ సివిల్ కోడ్‌పై చర్చించి ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న సివిల్ కోడ్ మతపరమైంది. వివక్ష చూపుతుంది. విస్తృత స్థాయిలో దీనిపై చర్చ జరగాలి. సెక్యూలర్ సివిల్ కోడ్‌ను డిమాండ్ చేయాల్సిన సమయం ఆసన్నమైంది' 'దేశంలో సమతౌల్యం దెబ్బతీయడానికి కొందరు ప్రతికూల ఆలోచనాధోరణి ఉన్నవారు యత్నిస్తున్నట్లు ప్రజలు అర్థం చేసుకోవాలి. వారసత్వం, కులతత్వం సమాజాన్ని దెబ్బతీస్తాయి. ఈ రాజకీయాలను మనం వదిలించుకోవాలి'

## వైసీపీ పాలనలో నష్టపోయిన ఏపీని అభివృద్ధి చేసుకోవాలి



అమరావతి: వైసీపీ పాలనలో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని బాగుచేసుకోవడానికి అందరం కలిసికట్టుగా కృషిచేయాలని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. అమరావతిలో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు అందరికీ శుభాకాంక్షలు చెప్పారు. గురువారం నాడు అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ... ప్రజా సంక్షేమానికి చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

ఇప్పుడు మనం ఆనందంగా స్వాతంత్ర్యం జరుపుకుంటున్నామంటే పూర్వం ఎందరో పెద్దల ప్రాణ త్యాగ ఫలితమేనని అన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరం బాధ్యతతో పనిచేయాలని సూచించారు. అసెంబ్లీ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీలో అర్థవంతమైన చర్చ జరగడానికి వారి పాత్ర ఎంతో ఉందని చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

**అన్నా క్యాంటీన్ ప్రారంభం..** మరోవైపు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుడివాడ మునిసిపల్ పార్క్‌లో ఉన్న 'అన్నా క్యాంటీన్'ను ప్రారంభించారు. చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి ఎన్టీఆర్ స్టేడియానికి చేరుకుని 'అన్నా క్యాంటీన్'ను ప్రారంభించారు. ముఖ్యమంత్రి దంపతులకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అన్నాక్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం స్వయంగా చంద్రబాబు దంపతులు భోజనాన్ని వడ్డించారు. ఆపై సీఎం దంపతులు సైతం టోకెన్ తీసుకుని మరీ అక్కడే భోజనం చేశారు. భోజనం చేస్తున్న సమయంలో చంద్రబాబు ప్రజలతో కాసేపు ముచ్చటించారు. రాష్ట్రవ్యాప్తంగా 100 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఈ అన్నా క్యాంటీన్ల ద్వారా నిరుపేదలకు రూ.5లకే ఆహారాన్ని అందిస్తారు.

## వైద్యురాలిని హత్య చేసిన నిందితులని కఠినంగా శిక్షించాలి




అమరావతి: వెస్ట్ బెంగాల్‌లో ట్రైనీ డాక్టర్‌ని అత్యాచారం చేసి అత్యంత క్రూరంగా హింసించి హత్య చేశారని ఏపీ మాజీ పీసీసీ అధ్యక్షులు శైలజానాథ్ అన్నారు. డాక్టర్ హత్యని నార్మల్ సంఘటనలా ట్రీట్ చేస్తున్నారని మండిపడ్డారు. దర్యాప్తుని చూస్తుంటే బాదేస్తుందని చెప్పారు. గురువారం నాడు విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో శైలజానాథ్ మీడియాతో మాట్లాడుతూ... కరోనా సమయంలో ఎంతో మంది డాక్టర్లు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రైనీ డాక్టర్‌ని చాలా హింసించి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికి కూతురి మొఖం కూడా చూపించలేదని వాపోయారు. వైద్యురాలిని చంపిన వ్యక్తిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలను సమాజం ఉపేక్షించకూడదని చెప్పారు. అక్కడ సాక్ష్యాలని కొందరు దుండుగులు తారుమారు చేస్తున్నారని ఆరోపించారు. ప్రొటెస్ట్ చేసేవారిపై దాడులు చేయడం ఏంటని ప్రశ్నించారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు నిందితులని వెంటనే కఠినంగా శిక్షించాలని శైలజానాథ్ డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు..** మరోవైపు.. దేశ ప్రజలకు ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి. స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం నాడు విజయవాడ ఏపీసీసీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని షర్మిల ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎంతో మంది త్యాగాల ఫలితం మనకు సిద్ధించిన స్వాతంత్ర్యమని అన్నారు. మహనీయులకు అందరికీ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఘన నివాళులు తెలుపుతున్నామని చెప్పారు. గత పదేళ్లుగా బీజేపీ ఈ దేశంలో అధికారంలో ఉందన్నారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది, ప్రగతికి పునాదులు వేసింది కాంగ్రెస్ పార్టీ అని షర్మిల పేర్కొన్నారు.




## వెయిటింగ్‌లోని ఐపీఎస్‌లకు మెమో.. వెలుగులోకి సంచలన విషయాలు

అమరావతి: ఏపీలో వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్‌లకు మెమో జారీ వెనుక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచారణకు ఆదేశించిన కేసులను నీరుగార్చేలా కొందరు ఐపీఎస్‌లు కుట్ర చేసినట్లు నిఘా విభాగం గుర్తించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీంతో డీజీపీ కార్యాలయం అప్రమత్తమై వెయిటింగ్‌లో ఉన్న 16 మంది ఐపీఎస్‌లకు మెమోలు జారీ చేసింది.

**రోజూ రావాల్సిందే.. సంతకం పెట్టాల్సిందే..** తమ పేర్లతో పాటు వైకాపా పెద్దల ప్రమేయాన్ని తక్కువ చేసి చూపేలా దర్యాప్తు చేయాలని ఆయా కేసులపై విచారణ చేస్తున్న అధికారులు, సిబ్బందికి వెయిటింగ్‌లో ఉన్న కొందరు ఐపీఎస్‌లు సూచనలు చేసినట్లు నిఘా విభాగం గుర్తించింది. వివిధ కేసుల్లో జరుగుతున్న అంతర్గత విచారణను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు సాగించినట్లు డీజీపీ కార్యాలయం తేల్చింది. తూతూ మంత్రంగా విచారణ ముగించాలని చెప్పినట్లు వెల్లడైంది. వెయిటింగ్‌లో ఉన్న కొందరు ఐపీఎస్‌ల తీరుతో ప్రభుత్వ పెద్దలు కంగుతిన్నారు. వారిలో కొందరు ఇప్పటికీ వైకాపాకు అనుకూలంగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. కేసుల దర్యాప్తునకు ఆటంకం కలిగించే ప్రయత్నాలను కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్ అధికారులు రోజూ వచ్చి హెడ్ క్వార్టర్స్‌లో సంతకాలు చేసి వెళ్లాలని డీజీపీ ఆదేశాలు ఇచ్చారు.



## రాష్ట్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాలు ఘనంగా జరిగాయి. గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని, తమ సహకారాలు అందించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ శోభిక, ఎమ్మెల్యే విజయ్ చంద్ర వీరశేఖర అధికారులు పాల్గొన్నారు.

## వారి జోలికి ఎవరొచ్చినా ఊరుకోం



కాకినాడ, ఆగస్టు 15: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పవన్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవవందాన్ని స్వీకరించారు డిప్యూటీ సీఎం. ఆపై ప్రజలనుద్దేశించి పవన్ ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా క్షీణించాయన్నారు. శాంతి భద్రతలు లేకపోతే రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి ఎవరూ ముందుకు రారన్నారు.

అందుకే శాంతి భద్రతలను సమర్ధవంతంగా నిర్వహించడాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఆడపిల్లలు, సగటు ప్రజల జోలికి ఎవరు వచ్చినా ఊరుకునేది లేదన్నారు. ఇదే విషయం కలెక్టర్, ఎస్పీల సదస్సులోనూ స్పష్టం చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా చిన్నా భిన్నం అయిపోయిందని విమర్శించారు. జల జీవన్ మిషన్ ప్రాజెక్టులకు పైపులు వేసి మంచి నీటి వసతి ఏర్పాటు చేయలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా ఉంటే గత ప్రభు త్వం ఋషికొండ ప్యాలెస్ లాంటి విలాస భవనాలను నిర్మించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం మాటల్లో కాదు చేతల్లో చేసి చూపిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## ఆరు పథకాల గ్యారంటీకి కట్టుబడి ఉన్నాం



గుంటూరు జిల్లా: దేశ స్వాతంత్రం కోసం తెలుగు నేల చాలా కార్యక్రమాలు చేసిందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా లోకేష్ హాజరయ్యారు. జిల్లా పోలీసుల వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... స్వాతంత్రం కోసం గుంటూరు జిల్లా వాసులు చాలా మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఈ రోజు వేడుకలు తనకు జీవితం మొత్తం గుర్తు ఉంటుందని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. దేశం అంటే భక్తి ఉండాలని సూచించారు. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు శాంతి, అహింస అనే ఆయుధాలుగా స్వేచ్ఛను సాధించారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ప్రజా సంఘాలకు మాట్లాడే స్వేచ్ఛ వచ్చిందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అందరి కళ్లల్లో ఆనందం కనిపిస్తుందని అన్నారు. సీఎం చంద్రబాబు హామీలకు అనవసరమైన ఆంక్షలతో సంక్షేమ పథకాలు కట్ చేయమని వివరించారు. ఏడాదికి రూ. 250 పింఛన్ పెంచడం కాదని.. ఒకేసారి వెయ్యి రూపాయలు తమ ప్రభుత్వంలో పెంచామని గుర్తుచేశారు. చంద్రబాబు ఇచ్చిన ఆరు పథకాల గ్యారంటీకి కట్టుబడి ఉన్నామని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన తమ ధ్యేయమని అన్నారు. ఇప్పటికే డీఎస్సీ ప్రకటించామని, పేదవారికి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌ని ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. రైతులకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. గుంటూరు జిల్లాలో 22,800 టన్నుల ఎరువులను రైతులకు అందించామని అన్నారు. పాడి రైతులకు రూ. 20 కోట్ల రుణాలు ఇచ్చామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. మత్స్యకారులను కూడా ఆదుకుంటున్నాం. గుంటూరు ఛానల్ ఆధునీకరణ కోసం నిధులు విడుదల చేశాం. ఎన్టీఆర్ వైద్య సేవను పటిష్ఠంగా అమలు చేస్తాం.. తల్లికి వందనం అమలు చేస్తాం. 560 స్కూల్స్ నీ అప్గ్రేడ్ చేయనున్నాం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నాం. పింఛన్ పంపిణీ చేశాం. రూరల్ వాటర్ మిషన్ అమలు, నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆగిపోయిన అమరావతి పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

## ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ బలోపేతం



నెల్లూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం బలోపేతం అవుతుందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. దేశంలో కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గౌరవంగా బతకాలని భారత తెలిపారు. వెంకటాచలం మండలం సరస్వతి నగర్‌లోని అక్షర విద్యాలయంలో జరిగిన 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో వెంకయ్య నాయుడు పాల్గొన్నారు. భారతదేశ ప్రజలందరికీ 78వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ... దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో శక్తివంతమైన భారత దేశంగా ముందుకెళ్లడం ఎంతో గర్వకారణంగా ఉందని వెంకయ్య నాయుడువెల్లడించారు. స్వరాజ్యం కావాలి పరాయి పాలన పోవాలని చాలా మంది మహనీయుల త్యాగమూర్తుల త్యాగఫలమే ఈ స్వాతంత్ర దినోత్సవమని కొనియాడారు. భారతదేశం గర్వపడేలా మువ్వన్నెల త్రివర్ణ పతాకం రూపకర్త తెలుగు వారు పింగళి వెంకయ్య కావడం చాలా గర్వకారణమని గుర్తుచేసుకున్నారు. దేశంలో 18 శాతం మంది ఇంకా ఆకలితో అలమటిస్తున్నారని చెప్పారు. మనం బతుకుతూ మన పక్కవారిని బతికించేలా సమాజం మారాలని వెంకయ్య నాయుడు సూచించారు. ప్రకృతితో మమేకమై జీవించాలని.. రాబోయే తరాలకు ప్రకృతి విలువను తెలియజేసేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. పిల్లలను సెల్‌ఫోన్‌కి దూరంగా ప్రకృతికి దగ్గరగా ఉంచి వారి జీవన విధానాన్ని తెలియజేయాలని చెప్పారు. పిల్లలకు చదువుతోపాటు సమాజంలో విలువల, పెద్దలపట్ల గౌరవం, ఆధ్యాత్మికం వైపు వెళ్లేలా చూడాలని వెంకయ్య నాయడు పేర్కొన్నారు.

## వైసీపీ పాలనలో భూ అక్రమాలపై చర్యలు: మంత్రి అనగాని

విశాఖ: వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా భూ అక్రమాలు జరిగినట్లు ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. విశాఖలో మాత్రమే భూ అక్రమాలు జరిగాయని అనుకుంటే పొరపాటే అన్నారు. ఆగస్టు 15సందర్భంగా విశాఖ గ్రీన్ పార్క్ కూడలి వద్ద సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన భూ దందాలపై విచారణ జరిపిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. 200సంవత్సరాలలో బ్రిటిష్ వారు ఎంత దోచుకున్నారో గడిచిన ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు అంతలా దోచుకున్నారంటూ అనగాని తీవ్ర విమర్శలు గుప్పించారు. నూతన ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నట్లు మంత్రి చెప్పుకొచ్చారు.

**ఫిర్యాదుల స్వీకరణకు సిసోడియా..** వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్ అగ్రిగోల్డ్ వ్యవహారంతోపాటు మరిన్ని అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉందని మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. అధికారం ఉన్నప్పుడు అక్రమంగా భూములు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇప్పుడు బుకాయిస్తున్నారని మండిపడ్డారు. అడ్డంగా దొరికిపోయిన జోగి రమేశ్ ఇప్పుడు కులప్రస్తావన తెస్తూ రాష్ట్రంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆగ్రహించారు. ఈ నేపథ్యంలోనే భూ అక్రమాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సిసోడియా రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నారని మంత్రి వెల్లడించారు.

**ఫైళ్ల మాయంపై విచారణ..** మదనపల్లె తరహాలోనే పలు చోట్ల భూములు ఆక్రమించి ముఖ్యమైన ఫైళ్లను మాయం చేశారని, వాటన్నింటిపైనా విచారణ చేస్తామని మంత్రి అనగాని తెలిపారు. అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. త్వరలోనే ఏపీ రాజముద్రతో నూతన పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని చెప్పారు. ఉత్తరాంధ్రలో నిర్మించే ప్రాజెక్టుకు సర్దార్ గౌతు లచ్చన్న పేరు పెట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి అనగాని సత్య ప్రసాద్ వెల్లడించారు.

# బిగ్ బాస్ మోనాల్.. వాట్ వే బ్లాస్టింగ్ లుక్!

బిగ్ బాస్ బ్యూటీ మోనాల్ గజ్జర్ కు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. అల్లరి నరేష్ సుడిగాడు మూవీతో టాలీవుడ్ కు పరిచయమైంది ఈ అమ్మడు. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. కానీ సినిమాల కన్నా బిగ్ బాస్ షోతో తెలుగులో మంచి గుర్తింపు సంపాదించుకుంది. బిగ్ బాస్-4 సీజన్ లో తన ఆటతో అందరినీ ఆకట్టుకుంది. గ్లామరస్ గా కనిపిస్తూ కుర్రాళ్ల మనసులు దోచేసింది. యూత్ లో ఫుల్ ఫాలోయింగ్ దక్కించుకుంది ఈ బ్యూటీ. దీంతో ఆమెకు తెలుగు సినిమాల్లో మంచి అవకాశాలు వస్తాయని అంతా అనుకున్నారు కానీ అలా జరగలేదు. ప్రస్తుతం బుల్లితెరపై సందడి చేస్తోంది బ్యూటీ. పలు డ్యాన్స్ షోలకు జడ్జిగా వ్యవహరిస్తోంది. దాంతోపాటు వరుస గుజరాతీ సినిమాల్లో నటిస్తోంది. యాక్ట్రెస్ గా రానిస్తోంది. సోషల్ మీడియాలో కూడా ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది అమ్మడు. హీట్ పుట్టించే పిక్స్ కు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది. గ్లామర్ గేట్లు ఎత్తేసి అందాలు ఆరబోస్తుంటోంది. తాజాగా కొత్త పిక్స్ షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది మోనాల్. పర్పుల్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో ఫోటో షూట్ పోస్ట్ చేసింది. అందులో సింపుల్



మేకప్ తో మోనాల్ అదిరిపోయింది. క్రేజీ నెక్ సెట్ ఆమె అందాన్ని మరింత పెంచింది. ముఖ్యంగా ఎద అందాలతో కవ్విస్తోంది. సిడ్నీ ఒపెరా హౌస్ లో ఐదో అంతర్జాతీయ గుజరాతీ ఫిల్మ్ ఫెస్టివల్ జరిగినట్లు తెలిపింది మోనాల్. ప్రస్తుతం ఆమె కొత్త పిక్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అయితే నయా ఫోటోల్లో మోనాల్ గజ్జర్ సూపర్బ్ గా ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అందానికి పర్యాయ పదమని చెబుతున్నారు. బ్లాస్టింగ్ అందాలకు క్లీన్ బౌల్డ్ అయ్యామని అంటున్నారు. లైకులు కొడుతూ నెటిజన్లు.. కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. అయితే అహ్మదాబాద్ కు చెందిన మోనాల్.. స్థానిక %×చీ+% వైశ్యా బ్యాంకులో అవుట్ సోర్స్ లో జాబ్ చేసింది. ఆ సమయంలో తీసుకున్న ఒక్క నిర్ణయంతో ఆమె లైఫ్ టర్న్ అయింది. 2011లో రేడియో మిర్చి నిర్వహించిన మిర్చి క్వీన్ బీ అందాల పోటీలో పార్టిసిపేట్ చేసి కిరీటాన్ని దక్కించుకుంది మోనాల్. ఆ తర్వాత మిస్ గుజరాత్ అందాల పోటీలో కూడా పాల్గొంది. తన అందం, టాలెంట్ తో టైటిల్ ను కైవసం చేసుకుంది. అలా ఉద్యోగం మానేసి మోడల్ గా కెరీర్ స్టార్ట్ చేసిన మోనాల్.. 2012లో తెలుగు సినిమాతోనే సినీ ఇండస్ట్రీకి పరిచయం అయింది. మళ్లీ మోనాల్ గజ్జర్.. టాలీవుడ్ లో ఎప్పుడు సందడి చేస్తుందో వేచి చూడాలి.

# యంగ్ డైరెక్టర్ తో ఎన్టీఆర్.. క్రేజీ కాంబినేషన్?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం పాన్ ఇండియా లెవల్ లో తన మార్కెట్ పెంచుకోవడంపై దృష్టి పెట్టారు. అందులో భాగంగా ఇప్పటికే కొరటాల శివ దర్శకత్వంలో దేవర మూవీ చేస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ చివరి దశలో ఉంది. జాన్వీ కపూర్ ఈ మూవీలో హీరోయిన్ గా నటిస్తోంది. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా టాలీవుడ్ లోకి అడుగుపెడుతున్నారు. ఇదిలా ఉంటే హిందీలో వార్ 2 మూవీలో తారక్ నటిస్తున్నాడు. హృతిక్ రోషన్ తో పాటు జూనియర్ ఎన్టీఆర్ వార్ 2 చిత్రంలో స్క్రీన్ షేర్ చేసుకుంటున్నాడు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో వార్ 2 తెరకెక్కుతోంది. మరో వైపు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కనున్న డ్రాగన్ మూవీ ఆగష్టు లేదా సెప్టెంబర్ లో స్టార్ట్ అవుతుందనే మాట వినిపిస్తోంది. ఈ చిత్రంలో రష్మిక మందన హీరోయిన్ గా ఖరారైందనే ప్రచారం నడుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇలా వరుసగా మూడు పెద్ద ప్రాజెక్ట్స్ స్టార్ దర్శకులతో తారక్ చేస్తున్నాడు. ఇదిలా ఉంటే ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ ఓ యంగ్ డైరెక్టర్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడనే టాక్ ఫిల్మ్ నగర్ సర్కిల్ లో వినిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా హాయ్ నాన్న సినిమానితో శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అయ్యాడు.



ఈ మూవీ ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ప్రేక్షకుల ముందుకొచ్చింది. కూతురు సెంటిమెంట్ తో వచ్చిన హాయ్ నాన్న సినిమా నానికి సక్సెస్ అందించింది. అయితే ఈ దర్శకుడు రీసెంట్ గా ఎన్టీఆర్ కి స్టోరీ నేరేట్ చేసాడంట. స్టోరీ నచ్చడంతో తారక్ ఒకే చెప్పాడనే మాట వినిపిస్తోంది. వైరా ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించడానికి రెడీ అయ్యిందంనే టాక్ నడుస్తోంది. అయితే ఇది ఎంత వరకు కరెక్ట్ అనేది తెలియాల్సి ఉంది. ఎన్టీఆర్ ప్రస్తుతం లైన్ అప్ చూసుకుంటే మరో మూడేళ్ళ వరకు వేరొక దర్శకుడితో సినిమా చేసే ఛాన్స్ కనిపించడం లేదు. దేవర తర్వాత వార్ 2, డ్రాగన్ సినిమాలు ఉన్నాయి. వీటి తర్వాత దేవర పార్ట్ 2 కూడా చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ పూర్తి చేయకుండా కొత్త దర్శకుడిగా ఛాన్స్ ఇస్తాడా అంటే ఆలోచించాల్సిందే. అఫీషియల్ గా ఎనౌన్సమెంట్ వచ్చే వరకు ఈ మూవీపై స్పష్టత రాదు. ఒక వేళ శౌర్యువ్ తో మూవీ చేయడానికి ఎన్టీఆర్ ఒకే చెబితే మాత్రం కచ్చితంగా యంగ్ డైరెక్టర్ కి అది పెద్ద బ్రేక్ అవుతుందని సినీ విశ్లేషకులు అంటున్నారు.





# రాజాసాబ్.. లీక్ అలెర్ట్



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ గా ఎవ్వరికి అందనంత ఎత్తులో ఉన్నాడు. అతనితో సినిమా చేయాలంటే నిర్మాతలు 300ం కోట్లకి పైగా బడ్జెట్ రెడీ చేసుకోవాల్సిందే. అలాగే దర్శకులు లార్జర్ దెన్ లైఫ్ లాంటి కథలని సిద్ధం చేసుకొని చెప్పాల్సి ఉంటుంది. అయిన కూడా వెంటనే డేట్స్ దొరుకుతాయని గ్యారెంటీ లేదు. కనీసం మూడేళ్లు అయన ప్రభాస్ తో మూవీ చేయాలంటే వెయిటింగ్ లిస్ట్ లో ఉండాల్సిందే. ఇండియన్ బాక్సాఫీస్ హిస్టరీలో ఇప్పటి వరకు ఏ హీరోకి కూడా ఈ రేంజ్ ఇమేజ్, మార్కెట్ దొరకలేదు. స్టార్ హీరోలు అయిన కూడా కేవలం ఒక్క భాషకి మాత్రమే పరిమితం అయిపోయారు. అయితే బాహుబలి తర్వాత ప్రభాస్ అన్ని భాషలకి చెందిన హీరోగా మారిపోయాడు. ఆయనతో పోటీగా సినిమా రిలీజ్ చేయాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించుకునే పరిస్థితి మిగిలిన స్టార్స్ కి వచ్చేసింది. షారుఖ్ ఖాన్ లాంటి బాలీవుడ్ స్టార్ సలార్ తో పోటీ పడి నిలబడలేకపోయారు. తాజాగా కల్కి 2898ఏడీతో ప్రభాస్ మరో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం ఆయన లైన్ అప్ లో సలార్ పార్ట్ 2, స్పిరిట్ , హను రాఘవపూడి మూవీ, రాజాసాబ్ సినిమాలు ఉన్నాయి. వీటిలో రాజాసాబ్ షూటింగ్ సగానికి పైగా కంప్లీట్ అయ్యింది. వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజ్ చేయాలనే టార్గెట్ తో తెరకెక్కిస్తున్నారు. అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైన్మెంట్ తో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇదిలా ఉంటే రాజాసాబ్ నుంచి ఫోటోలు లీక్ అయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కొన్ని పిక్స్ ని వైరల్ చేస్తూ రాజాసాబ్ సినిమాలో స్టిల్స్ అంటూ ట్రెండ్ చేస్తున్నారు. అయితే ఈ మూవీ నుంచి ఎలాంటి ఫోటోలు లీక్ కాలేదంట. అలాగే సినిమాలో ప్రభాస్ క్యారెక్టర్ పేరు జై సింగ్ ఆజాద్ అంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పంజాబీ గెటప్ లో ఉన్న ప్రభాస్ ఫోటోని రాజాసాబ్ మూవీ స్టిల్ అంటూ వైరల్ చేస్తున్నారు. జై సింగ్ ఆజాద్ అనే పేరు కూడా ఇంకా ఖరారు కాలేదంట. నిజానికి ఆ స్టిల్ కల్కి మూవీ ప్రమోషన్ సాంగ్ కోసం తీసుకున్నదని తెలుస్తోంది. అదే ఫోటోని రాజాసాబ్ పిక్స్ అంటూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. మూవీ అఫీషియల్ అప్డేట్ వచ్చే వరకు ఇలాంటి రూమర్స్ ని నమ్మొద్దని చిత్ర యూనిట్ కూడా ఫ్యాన్స్ కి విన్నవిస్తోంది

# కంగువ టాలీవుడ్ లో రేటెంత?



కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకి నటుడిగా ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. విలక్షణ నటుడిగా కమల్ హాసన్, విక్రమ్ తర్వాత ఆ స్థాయిలో గుర్తింపుని సంపాదించాడు. ఓ వైపు యాక్షన్ కమర్షియల్ సినిమాలు చేస్తూనే కంటెంట్ బేస్డ్ కథలకి కూడా సూర్య పెద్దపీట వేస్తూ ఉంటాడు. అందుకే జై భీమ్, ఆకాశం నీ హద్దురా లాంటి సినిమాలు సూర్య నుంచి చూడగలిగాం. ఆ మూవీస్ ఎంత పెద్ద హిట్ అయ్యాయో అందరికి తెలిసిందే. ఈ రెండు సినిమాలకి ముందు సూర్యకి ఆశించిన స్థాయిలో సక్సెస్ లు పడలేదు. దీంతో టాప్ లో ఉన్న అతని మార్కెట్ దారుణంగా పడిపోతూ వచ్చింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో సూపర్ స్టార్ రజినీకాంత్ తర్వాత ఆ స్థాయిలో సూర్య సినిమాలకి మార్కెట్ ఉంది. అయితే వరుస ఫెయిల్యూర్స్ కారంగా అతని ఇమేజ్ తగ్గిపోయింది. ఆకాశం నీ హద్దురా మూవీ సక్సెస్ అయిన డైరెక్ట్ ఓటీటీ రిలీజ్ అయ్యింది. జైభీమ్ మూవీ సూర్యకి వచ్చిన చివరి సక్సెస్. తరువాత ఈటీ అనే మూవీ చేశాడు. ఇది డిజాస్టర్ అయ్యింది. విక్రమ్ లో రోలెక్స్ క్యారెక్టర్ లో పవర్ ఫుల్ విలన్ గా సూర్య కనిపించాడు. రెండేళ్ల క్రితం విక్రమ్ మూవీ వచ్చింది. ఆ తరువాత శివ దర్శకత్వంలో కంగువ మూవీని సూర్య ఒప్పుకున్నాడు. సుదీర్ఘంగా షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం అక్టోబర్ 10న రిలీజ్ కాబోతోంది. పాన్ వరల్డ్ రేంజ్ లో మూవీ థియేటర్స్ లోకి వస్తోంది. పోస్టర్స్, టీజర్ తో కంగువ మూవీ ఒక్కసారిగా ఎక్స్ పెక్టేషన్స్ పెంచేసింది. ఇందులో ఆటవిక వీరుడిగా సూర్య విచిత్రమైన గెటప్ లో కనిపిస్తున్నాడు. టైం ట్రావెల్ కాన్సెప్ట్ తో ఈ మూవీ రెడీ అవుతోంది. ఇదిలా ఉంటే ఈ సినిమా రైట్స్ కోసం భారీ పోటీ నెలకొని ఉందంట. చాలా కాలం తర్వాత తెలుగు డిస్టిబ్యూటర్స్ కంగువ మూవీ రిలీజ్ రైట్స్ కోసం పోటీ పడుతున్నారంట. ప్రస్తుతం అయితే 20 కోట్లు తెలుగు రైట్స్ కోసం ఇవ్వడానికి ప్రముఖ డిస్టిబ్యూటర్ ముందుకొచ్చారని టాక్. అయితే ఇంకా ఎక్కువ వస్తాయని మేకర్స్ వెయిట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సూర్య ఇమేజ్ పరంగా చూసుకుంటే 20 కోట్లు పెద్ద మొత్తమని చెప్పొచ్చు. అయితే కంగువ మూవీ భారీ బడ్జెట్ తో తెరకెక్కింది కావడం, అలాగే హైవోల్టేజ్ కాన్సెప్ట్ వలన మేకర్స్ ఇంకా ఎక్కువ ఎక్స్ పెక్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. రిలీజ్ కి ఇంకా సమయం ఉంది కాబట్టి థీయాట్రికల్ రైట్స్ కి సంబంధించిన బిజినెస్ చర్చలు కొనసాగే అవకాశం ఉంది. మరి ఫైనల్ గా ఎంతకి డీల్ క్లోజ్ అవుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# రాధిక 3.0 ఎవరో తేలిపోయింది..!

సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటించిన డీజే టిల్లు మరియు టిల్లు స్క్వేర్ సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ముఖ్యంగా టిల్లు స్క్వేర్ సినిమాకు వచ్చిన ఆధరణ నేపథ్యంలో వెంటనే మూడో టిల్లు ను కూడా తీసుకు వస్తామని ప్రకటించారు. ఇప్పటికే అందుకు సంబంధించిన వర్క్ షురూ అయ్యిందని సమాచారం అందుతోంది. టిల్లు క్యూబ్ సినిమా కోసం ఇప్పటికే సిద్దు స్క్రిప్ట్ వర్క్ మొదలు పెట్టాడు అంటూ ఆయన సన్నిహితులు అంటున్నారు. సిద్దు చిన్న లైన్ తీసుకుని సెట్స్ పైకి వెళ్తాడు. దాన్ని ఆన్ లొకేషన్, షూటింగ్ సమయంలో డెవలప్ చేస్తూ వెళ్తాడు అంటూ టిల్లుకు వర్క్ చేసిన టెక్నీషియన్స్ కొందరు చెప్పుకొచ్చారు. ఆ విషయం పక్కన పెడితే సిద్దు జొన్నలగడ్డ కి జోడీగా మొదటి టిల్లులో నేహా శెట్టి హీరోయిన్ గా నటించింది. రాధిక గా ఆమె పాత్రకు మంచి మార్కులు పడ్డాయి. ఇప్పటికి కూడా రాధిక పేరు మారు మ్రోగుతూనే ఉంది. టిల్లు స్క్వేర్



లో హీరోయిన్ గా అనుపమ పరమేశ్వరన్ నటించింది. లిల్లీ గా ఆమెను చూపించినా కూడా రాధిక 2.0 గా అంతా మాట్లాడుకున్నారు. ఇప్పుడు టిల్లు క్యూబ్ లో రాధిక 3.0 గా ఎవరు నటించబోతున్నారు అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం తెలుగు అమ్మాయి అయిన ప్రియాంక జవాల్కర్ ను ఎంపిక చేశారు అంటూ సమాచారం అందుతోంది. సిద్దు జొన్నలగడ్డ హీరోయిన్ ఎంపిక పర్ఫెక్ట్ గా ఉంటుందని గతంలో నిరూపితం అయ్యింది. కనుక ఈసారి కూడా ప్రియాంక జవాల్కర్ ఎంపిక కచ్చితంగా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవడం ఖాయం అన్నట్లుగా టిల్లు ఫ్యాన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విజయ్ దేవరకొండ తో టాక్సీవాలా సినిమాలో నటించిన ముద్దుగుమ్మ ప్రియాంక జవాల్కర్ ఆ తర్వాత పలు సినిమాల్లో నటించి మెప్పించింది. అయితే స్టార్స్ కు జోడీగా నటించే అవకాశాలు రాకపోవడంతో కెరీర్ ఖతం అనుకున్నారు. అనూహ్యంగా టిల్లు గాడి లవర్ పాత్ర ఈ అమ్మడికి లభించింది. దీంతో ఈ అమ్మడి కెరీర్ యూటర్న్ తీసుకుంటుందేమో చూడాలి.

# ప్యారిస్ ప్యాషన్ వీక్ లో జాన్వీ ధగధగలు!

ఫ్యాషన్ వరల్డ్ లో జాన్వీకపూర్ ఎంపికలు ఎప్పుడూ సంథింగ్ స్పెషల్ గా హైలైట్ అవుతుంటాయి. రెగ్యులర్ ఔట్ ఫిట్స్ ని పక్కనబెడితే కవర్ పేజీల షూట్లో జాన్వీ మెరిపులు అసాధారణంగా ఉంటాయి. ష్యాషన్ డిజైనర్ల ఎంపికల్లో జాన్వీ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఇప్పటికే అమ్మడు షోలు ఎన్నో చేసింది. విదేశీ వేదికలపై మెరిసింది తక్కువే గానీ..మెరిపించిన కొన్ని సందర్భాల్లోనైనా డిఫరెంట్ డిజైనర్స్ లో తానో బ్రాండ్ బ్యూటీ గా ప్రూవ్ చేసింది. తాజాగా అమ్మడు 2024 పారిస్ ఫ్యాషన్ వీక్ లో ఓ రేంజ్ లో హైలైట్ అయింది. సొగసరి స్టైలిష్ లుక్ ఆహుతుల్ని మైమరిపించింది. ఆరా బ్రాండ్ హెూల్ గ్రాఫిక్ టోన్ డిజైనర్ వేర్ లో పై , కోఆర్డినేటింగ్ ఐరిడెసెంట్ మెర్మైడ్ ట్రయిల్-స్కర్ట్లో జాన్వీ ధగధగలు మామూలుగా హైలైట్ కాలేదు. స్ట్రాప్ లెస్ బ్లౌజ్ లో మరింత అందంగా కనిపిస్తుంది. దీనికి తగ్గట్టు జాన్వీమ్యాకప్, కేశాలంకారణ మరింత ఆకర్షణీయంగా



తీర్చిదిద్దాయి. అచ్చంగా ఈ డిజైనర్ లో మత్స్య కన్యనే తలపించింది. టాప్ టూ బాటమ్ జాన్వీ ఎంపిక చేసుకున్న డిజైన్ నెక్ట్స్ లెవ్ లో అనొచ్చు. ప్రముఖ డిజైనర్ రాహుల్ మిశ్రాకు మద్దతుగా పారిస్ ప్యాషన్ వీక్ లో ఇలా మెరిసింది. ఈ లుక్ నెట్టింట వైరల్ గా మారింది. ఒక్క క్షణం అంతా స్టన్ అయిపోతున్నారు. ఆమె మన జాన్వీనా? అంటూ సందేహ పడుతున్నారు. జాన్వీని అలా చూడటానికి రెండు కళ్లు చాలవంటూ పోస్టులు పెడుతున్నారు. ఇక జాన్వీ కెరీర్ జెట్ స్పీడ్ తో పరుగులు పెడుతోన్న సంగతి తెలిసిందే.

బాలీవుడ్, టాలీవుడ్ అంటూ రెండు భాషల్ని దున్నేస్తుంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన దేవరలో నటిస్తోంది. ఆ సినిమా రిలీజ్ కి ముందే రామ్ చరణ్ 16వ చిత్రంలో కూడా ఛాన్స్ అందుకుంది. బాలీవుడ్ లో సినిమాలతోనూ బిజీగా ఉంది.





## రాజస్థానీ లెహెరియా తలపాగా ధరించిన ప్రధాని మోదీ.. ప్రత్యేకత ఏంటో తెలుసా?

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పిల్లలు, పెద్దలు అందరూ జాతీయ పతాక ఆవిష్కరణల్లో పాల్గొంటున్నారు. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోట వేదికగా స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. వరుసగా 11వ సారి ఆయన ప్రతిష్టాత్మక ఎర్రకోటపై జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆహార్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోదీ తెల్లటి కుర్తా, చుడీదార్, లేత నీలం రంగు బంద్‌గాలా జాకెట్ ధరించారు. ముఖ్యంగా ఆయన ఇవాళ (ఆగస్టు 15) రాజస్థానీ లెహెరియా ప్రింట్ తలపాగా ధరించి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు వైవిధ్య భరితమైన ప్రత్యేక తలపాగాలను ధరించే సంప్రదాయాన్ని ప్రధాని మోదీ ఈసారి కూడా కొనసాగించారు. ఇవాళ ధరించిన తలపాగా నారింజ, పసుపు, ఆకుపచ్చ రంగుల్లో ఉంది. తలపాగాకు ఉన్న పొడవాటి తోక కూడా ఈ మూడు రంగుల కలయికలోనే ఉంది. రాజస్థాన్‌కు చెందిన సాంప్రదాయ టెక్స్‌టైల్ టెక్నిక్‌తో దీనిని తయారు చేశారు. ఈ లెహెరియా డిజైన్‌ను థార్ ఎడారిలో కనిపించే 'నేచురల్ వేవ్' నమూనా నుంచి ప్రేరణగా తీసుకొని తయారు చేశారు. ఇక గతేడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం సందర్భంగా ప్రధాని మోదీ పసుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగుల కలయికతో తయారు చేసిన రాజస్థానీ బంధాని ప్రింట్ తలపాగాను ధరించారు. ఇక అంతక్రితం ఏడాది 2022లో ఎరుపు రంగు నమూనా, కుంకుమ పువ్వు రంగు రంగులో ఉన్న పొడవాటి తోక ఉన్న తలపాగాను మోదీ ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**మోదీ కీలక సందేశం**.. స్వాతంత్ర్య సమరయోధులకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది. వారి త్యాగాలను స్మరించుకునే రోజు ఇది. 20వ శతాబ్దపు తొలి నాళ్లలో 40 కోట్ల మంది భారతీయులు ఒక్కతాటిపైకి వచ్చి దేశం నుంచి బ్రిటీష్ పాలనను తరిమికొట్టారు. అప్పుడు 40 కోట్ల మంది జనాభా ఉన్నారు. నేడు మనం 140 కోట్ల మంది జనాభా ఉన్నాం. 40 కోట్ల మంది ఆ నాడు కష్టమైన పనిని సాధించి చూపారు. నేడు 140 కోట్ల మంది మనం దేశాన్ని ముందుకు సాగించగలం. నాడు ఆ 40 కోట్ల మందిలో చాలా మంది స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం ప్రాణాలు అర్పించారు. నేడు 140 కోట్ల మంది దేశం కోసం బతకాలి. దేశాన్ని ముందుకు నడిపించాలి" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

**గర్వంగా తలలు పైకెత్తాం: మోదీ...** "లోకల్ కోసం వోకల్ నినాదం స్వావలంబన మంత్రంగా మారింది. మనం అడుగులు వేసేటప్పుడు, భవిష్యత్ ప్రాణాలను సిద్ధం చేసుకునే ప్రతి ప్రయత్నం వెనుక 'మేరా భారత్ మహాన్' పదాలు ఆత్మగా ఉంటాయి. కోవిడ్ వంటి మహమ్మారి సమయంలో ఇతరులకు సాయం చేసేందుకు దేశ ప్రజలు ముందుకు రావడం మనం చూశాం. మన కరోనా వారియర్స్ అవసరమైన వారికి సేవ చేసిన విధానం, మన సైనికులు సర్జికల్ స్ట్రైక్స్ చేయడం చూశాం. ఇక మన వైమానిక దళం వైమానిక దాడులు చేయడం చూసినప్పుడు ప్రతి భారతీయుడు వారిని చూసి గర్వంగా తలలు పైకెత్తాం" అని మోదీ అన్నారు.

## సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్



భద్రాద్రి: సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్టు రెండో పంప్ హౌస్‌ను ప్రారంభించారు. అనంతరం సీతారామ ప్రాజెక్టు పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. మొదటి పంప్‌హౌస్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ములకలపల్లి మండలం కమలాపురంలో మూడో పంప్ హౌస్‌ను మంత్రి భట్టి విక్రమార్క స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ పథకం కింద 3.29 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు, 3.45 లక్షల ఎకరాల స్థిరీకరణ ఆయకట్టుకు నీరివ్వాలన్నది లక్ష్యం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జలయజ్ఞం కింద నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేందుకు రాజీవ్‌సాగర్, ఇందిరా సాగర్ ఎత్తిపోతల పథకాలను అప్పటి ప్రభుత్వం చేపట్టింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పునరాకృతిలో భాగంగా నిర్మాణంలో ఉన్న రెండు ఎత్తిపోతల పథకాల స్థానంలో 'సీతారామ'కు గత భారాస ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2016 ఫిబ్రవరి 16న రూ.7,926 కోట్లతో దీనికి పరిపాలనా అనుమతి ఇచ్చింది. 2018లో ఈ అంచనా వ్యయం రూ.13,057.98 కోట్లకు పెరిగింది. ఇప్పటికే చేపట్టిన పనులకు పెరిగిన ధరలు, ఇంకా టెండర్లు పిలవాల్సిన డిస్ట్రిబ్యూటరీ పనులకు కలిపి సుమారు రూ.18,600 కోట్ల వ్యయమవుతుందని అంచనా. ఇప్పటి వరకు రూ.7,919.65 కోట్లు ఖర్చుచేయగా సుమారు మరో రూ.పదివేల కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుంది.

## నా జీవిత కల సాకారం అయింది.. సీతారామ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంలో తుమ్మల



ఖమ్మం: సీతారామ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంతో తన రాజకీయ జీవిత కల సాకారమైందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8వేల కోట్లు ఖర్చు పెట్టగా.. పంప్ హౌజ్ మోటర్లు పాడవకుండా ఉండేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల హడావిడి ఉన్నా.. సీఎం రేవంత్ సీతారామ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం కోసం వచ్చారని తెలిపారు. "ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా యాతాలకుంట టన్నెల్ పూర్తి చేస్తే సత్తుపల్లి ట్రంక్ పరిధిలో ఆయకట్టుకు, జూలూరుపాడు టన్నెల్ పూర్తి చేస్తే పాలేరుకు గోదావరి జలాలు అందుతాయి. రైతు రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ భద్రాద్రి రాములవారి పాదాల వద్ద ప్రకటన చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి ఇవాళ సగర్వంగా వైరా సభ నిర్వహిస్తున్నాం. నాగార్జున సాగర్ నీళ్ళు రాని పక్షంలో గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టుకు నీరందిస్తాం. తక్కువ సమయంలో 70 రోజుల్లో వైరా లింక్ కెనాల్ పూర్తి చేశాం. ఓ పక్క సాగుకు దన్నుగా నిలుస్తూ.. మరోపక్క రైతు రుణమాఫీ చేసి మాది రైతన్నల పక్షమే అని నిరూపించుకున్నాం. మిగిలి ఉన్న సీతారామ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు సకాలంలో పూర్తిచేస్తాం" అని నాగేశ్వరరావు అన్నారు.


**నీళ్లు చల్లుకోవడానికి రాలేదు :** సీతారామ ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని తుమ్మల మండిపడ్డారు. తాను నీళ్లు చల్లుకోవడానికి రాలేదని.. బీఆర్ఎస్ నేతలు కూడా వచ్చి గోదారమ్మ ఆశీర్వాదం తీసుకోవాలన్నారు. "ప్రభుత్వాలు మారినా అభివృద్ధి నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. చిల్లర మాటలతో చేసే రాజకీయాలకు విలువ లేదు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఇతర నియోజకవర్గాలకు నిధులు ఎందుకు కేటాయించలేదు" అని తుమ్మల ప్రశ్నించారు.

## దుబ్బాక అభివృద్ధిపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు

సిద్దిపేట, ఆగస్టు 15: 78వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా దుబ్బాక గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాకలో చాలా పనులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. దుబ్బాక ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధి అవడం లేదని.. ముందుకు పోవడం లేదని తెలిపారు.

దుబ్బాక నియోజకవర్గం చుట్టు పక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందాయని.. కానీ దుబ్బాక అభివృద్ధి కావడం లేదన్నారు. దుబ్బాకకు రింగు రోడ్డు అవసరమని తెలిపారు. దుబ్బాకలో మొన్ననే బస్టాండ్, వందపడకల ఆసుపత్రి కట్టుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలల అయితుంది కానీ మనకు సహకారించడం లేదని కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

**ఊరూవాడా మువ్వన్నెల జెండా...** మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. గల్లీ గల్లీలోనూ జాతీయ పతాకం రెపరెపలాడుతోంది. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో, పరేడ్ గ్రౌండ్స్‌లలో మంత్రులు, ఎమ్మెల్యేలు జాతీయ జెండాలను ఎగురవేస్తున్నారు. ఆదిలాబాద్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. కొమురం



భీం ఆసిఫాబాద్ జిల్లాలో కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో వైభవంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్ మువ్వెన్నల జెండా ఎగుర వేశారు. నిర్మల్ జిల్లా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. జాతీయ జెండాను స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ఆవిష్కరించారు. మంచిర్యాల కలెక్టరేట్‌లో ప్రభుత్వ సలహాదారు హర్కార వేణు గోపాల్ రావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.




## బ్రేక్ డ్యాన్స్ చేసుకోండనే ధైర్యం ఎలా వచ్చింది కేటీఆర్..?

హైదరాబాద్ : తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు వేసుకోవచ్చని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన అభ్యంతర వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన సంగతి తెలిసిందే. ఈ అవకాశంపై రాష్ట్రంలోని మహిళలు హర్షం వ్యక్తం చేస్తుండగా.. కేటీఆర్ మాత్రం తీవ్ర అభ్యంతర వ్యాఖ్యలు చేయడంతో యావత్ మహిళా లోకం ఒక్కసారిగా భగ్గమన్నది.

కేటీఆర్ వ్యాఖ్యలపై తాజాగా.. మంత్రి సీతక్క వీడియోను రిలీజ్ చేశారు. మాజీ మంత్రి వ్యాఖ్యలను సీతక్క తీవ్రంగా తప్పుబట్టారు.

**ఇదేనా సంస్కారం..? :** 'ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్స్‌లు, రికార్డింగ్ డాన్స్‌లు చేసుకోవచ్చని కేటీఆర్ అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడారు. మీ తండ్రి కేసీఆర్‌గారు మీకు నేర్పిన గౌరవం సంస్కారం ఇదేనా కేటీఆర్?. మీ ఆడపడుచులు అంతా బ్రేక్ డాన్స్‌లు చేస్తున్నారా?. ఆడవాళ్ళంటే మీకు గౌరవం లేదు. మహిళల పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. భేషరతుగా కేటీఆర్ తెలంగాణ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలి. ఆడవాళ్ళను కించపరిచే విధంగా బ్రేక్ డాన్సులు చేసుకోండి అనడం మీ బుర్రలో ఉన్న బురదకు నిదర్శనం. గత పది సంవత్సరాలు హైదరాబాద్‌లో క్లబ్బులు, పబ్బులు, బ్రేక్ డాన్సులు ఎంకరేజ్ చేసిన చరిత్ర మీది. మహిళలు ఆర్థికంగా ఎదగాలని మహిళల కోసం సంక్షేమ పథకాలను అమలుపరుస్తున్నాము. అందులో భాగంగా పేద మహిళలకు రవాణా భారాన్ని తగ్గించేందుకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నాం. శ్రమ జీవులు, శ్రామిక మహిళ లు ప్రయాణ సమయంలో సమయం వృధా చేయకుండా ఏదో పని చేసుకుంటే తప్పేంటి?' అని కేటీఆర్‌పై సీతక్క ప్రశ్నల వర్షం కురిపించారు.

**మీ నోటికి ఎలా వచ్చాయ్..?** 'ఇంటి వద్ద చేసుకునే చిన్నా చితక పనులు బస్సుల్లో చేసుకుంటే.. వారిని బ్రేక్ డ్యాన్స్‌లు వేసుకోమనడం దుర్మార్గం. మహిళలు బ్రేక్ డ్యాన్స్‌లు చేసుకోండి అనే మాటలు నీ నోటికి ఎలా వచ్చాయి కేటీఆర్..? కేటీఆర్ మాట్లాడిన మాటలు అత్యంత అసభ్యకరంగా ఉన్నాయి. మహిళలు పట్ల అసభ్యకర మాటలు మాట్లాడిన కేటీఆర్ తీరును ఖండిస్తున్నాను. తెలంగాణ మహిళలను బ్రేక్ డ్యాన్స్ చేసుకొండి అనే ధైర్యం ఎలా వచ్చింది కేటీఆర్..?. తెలంగాణ మహిళలకు కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలి.. ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ కూడా క్షమాపణ చెప్పాలి.

ప్రజలకు ఉపయోగపడే పథకాలు మీకు నచ్చవు. ఉచిత బస్సు ప్రయాణ ఆలోచన మీకు రాలేదు.. పదేండ్లు మీరు చేయలేదు. మేము చేస్తే దాని మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆర్టీసీలో ప్రయాణాలు చేసేవాళ్లు తప్పుడు పనులు చేస్తున్నారన్నట్టుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. గుమ్మడికాయ దొంగలు అంటే కేటీఆర్ భుజాలు తడుముకోవడం ఎందుకు..?. కేటీఆర్ తక్షణ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి' అని సీతక్క డిమాండ్ చేశారు.


**ఇంతకీ కేటీఆర్ ఏమన్నారు..?** ఈ మధ్య బస్సుల్లో కొందరు కూరగాయలు అమ్మడం, బ్రష్ చేస్తూ కనిపించడం, వెల్లుల్లి ఒలుస్తూ, కుట్లు వేస్తూ కనిపించడంపై సోషల్ మీడియా వేదికగా పెద్ద చర్చే జరిగింది. ఈ వ్యవహారంపై కేటీఆర్ స్పందిస్తూ.. కుట్లు, అల్లికలే కాదు.. అవసరమైతే డ్యాన్సులు కూడా చేసుకోండని అవమానకరంగా మాట్లాడటం గమనార్హం. తాము తప్పు అని అనడం లేదని.. బస్సులు పెంచండని, అవసరమైతే ఒక్కొక్కరికి ఒక్కో బస్సు కేటాయించండి అంటూ కేటీఆర్ హేళనగా కామెంట్ చేయడం ఇప్పుడు వివాదాస్పదం అయ్యింది. ఇప్పటికే సీతక్క స్పందిస్తూ.. మహిళల ఆర్థిక ప్రగతి, సామాజిక భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ఎగతాళి చేస్తున్న వారికి స్వయం సహాయక సంఘాల మహిళలు బుద్ధి చెప్పాలని కూడా మంత్రి సీతక్క సూచించారు.

## త్వరలో స్టేషన్ ఘన్‌పూర్ ఉప ఎన్నిక.. రాజయ్య గెలుపు ఖాయం: కేటీఆర్



హైదరాబాద్: పార్టీకి ద్రోహం చేసిన వారికి నాలుగేళ్ల తర్వాత ప్రజలు బుద్ధి చెబుతారని, త్వరలో స్టేషన్ ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక వస్తుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఉప ఎన్నికలో భారాస నుంచి రాజయ్య గెలుపు ఖాయమన్నారు. హైకోర్టులో తీర్పు సానుకూలంగా వస్తుందని ఆశిస్తున్నామని, మిగతా వాళ్లపై నేరుగా సుప్రీంకోర్టుకు వెళ్లాలని ఆలోచిస్తున్నట్టు తెలిపారు. సభాపతి రాజకీయ పక్షపాతం చూపిస్తూ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ జెడ్పీటీసీ మారుపాక రవి, మాజీ ఎంపీపీ బుచ్చయ్య, ఇతర నేతలు తిరిగి భారాసలో చేరారు. కండువా కప్పి కేటీఆర్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కేసీఆర్ ఉన్నప్పుడు కరెంటు పోతే వార్త.. రేవంత్ వచ్చాక కరెంట్ ఉంటే వార్త. రుణమాఫీ సభకు రావాలని రాహుల్ గాంధీని ఆహ్వానించారు. రుణమాఫీ కాలేదని తెలుసుకొని రాహుల్ గాంధీ రాలేదు. కల్యాణ లక్ష్మి కింద ఇవ్వడానికి బంగారం దుకాణాలు దొరకలేదా? ఆడ పిల్లలకు రేవంత్‌రెడ్డి 2.5లక్షల తులాల బంగారం బాకీ ఉన్నారు. రేవంత్‌రెడ్డి సోదరులను ఏ ప్రజలు గెలిపించారు? రేవంత్ బామ్మర్ది కంపెనీకి రూ.వెయ్యి కోట్ల పనులు ఇచ్చారు. కవిత జైలులో ఉంటే అన్నగా నేను దిల్లీ పోయి కలవొద్దా? కవిత కేసు విషయంపై న్యాయవాదులతో మాట్లాడవద్దా? భాజపాతో ఒప్పందం ఉంటే కవిత 150 రోజులుగా జైల్లో ఉంటుందా? ఒక్క కాంగ్రెస్ నేత అయినా జైల్లో ఉన్నారా?త్వరలో కేసీఆర్ పార్టీ కార్యక్రమాలు ఇస్తారు. కొద్ది రోజుల్లోనే కేసీఆర్ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తారు. కేసీఆర్ పూర్తి చేసిన సీతారామ ప్రాజెక్టుకు రేవంత్ వెళ్లి రిబ్బన్ కట్ చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లని బీసీ డిక్లరేషన్‌లో చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు పెడతారు. భాజపా నేతలు.. కాంగ్రెస్, రేవంత్ చెప్పినట్టే నడుచుకుంటున్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ నేతలు ప్రజల్లో తిరగలేని పరిస్థితి వస్తుంది" అని కేటీఆర్ అన్నారు.

## తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌పై టీ.హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏమన్నారంటే?



హైదరాబాద్, ఆగస్టు 15: రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు భవనానికి ఇప్పటికే సీజేఐ శంకుస్థాపన చేశారని.. కొత్త హైకోర్టు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే తెలిపారు. తెలంగాణ హైకోర్టులో 78వ స్వాతంత్ర్యదినోత్సవం ఘనంగా నిర్వహించారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొత్త హైకోర్టు నిర్మాణానికి బడ్జెట్ కేటాయించిందన్నారు. తెలంగాణ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ఇంప్లిమెంట్ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. త్వరలోనే తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమల్లోకి వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగాన్ని నడిపించేందుకు న్యాయవ్యవస్థ ప్రాముఖ్యంగా పనిచేస్తుందన్నారు. ఏడాదిలో 9810 పెండింగ్ కేసులు పరిష్కరించామని చెప్పారు. కోర్ట్ రికార్డ్స్ డిజిటలైజేషన్‌లో భాగంగా హనుమకొండ, నల్గొండ కోర్టులను మోడల్ కోర్టులుగా గుర్తించామని అన్నారు. ఈటీహెచ్‌సీఆర్ వెబ్ సైట్‌ను ప్రారంభిస్తున్నామని.. నాలుగు లోక్ ఆదాలత్‌లలో 73,786 కేసులు కాంప్రమైజ్ చేసి.. రూ.4.9 కోట్లు బాధితులకు అందించామన్నారు. ఎంతోమంది యువతీ యువకులు న్యాయవ్యవస్థవైపు ఆసక్తి చూపుతున్నారని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే పేర్కొన్నారు. స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ మెంబెర్స్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## పది వేల కోట్లు ఖర్చయినా మాట నిలబెట్టుకుంటాం..

ఖమ్మం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాగార్జున సాగర్ ఆయకట్టుకి గోదావరి జలాలు తరలించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జిల్లాలోని 6.74లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తుమ్మల తెలిపారు. వ్యవసాయానికి గోదావరి జలాలు అందించేందుకు భద్రాద్రి రాముడి సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటిచ్చారని మంత్రి చెప్పారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా వైరాలో ఏర్పాటు చేసిన మూడో విడత రైతు రుణమాఫీ భారీ బహిరంగ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. రాజీవ్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకి గోదావరి జలాలు అందించడం కోసం సీతారామ ప్రాజెక్టు మూడు పంపు హౌస్‌లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ(గురువారం) ప్రారంభించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కేవలం మూడు, నాలుగు నెలల్లోనే రూ.600 కోట్లతో సీతారామ ప్రాజెక్టు స్ట్రక్చర్స్ ఏర్పాటు చేసి నీళ్లు విడుదల చేసినట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గంలో రాజీవ్ కెనాల కోసం భూములు ఇచ్చిన రైతన్నలకు చేతులెత్తి నమస్కరించారు. భూములు ఇచ్చిన ప్రతి అన్నదాతకూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దేవుడు దయవల్ల కృష్ణా, గోదావరి జలాలు ఖమ్మం జిల్లాకు వచ్చాయంటూ మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. జిల్లాలో నాగార్జున సాగర్ ఆయకట్టు కింద పంటలకు సాగునీరు అందించే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు మంత్రి తుమ్మల చెప్పారు. సీతారామ ప్రాజెక్టు మిగులు పనులకు రూ.10వేల కోట్లు ఖర్చయినా ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లల్లో పూర్తి చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలు తరలించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, జిల్లా రైతుల కోరికని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com